RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:63 27-8-2025 బుధవారం ఎడిటర్ :మద్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /

## మేకిన్ ఇండియాకు కొత్త అధ్యాయం : మోడీ



అహ్మదాబాద్ ఆగస్టు 26,(టుడే విదుర): నేడు అహ్మదాబాద్‌లో హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాల కోసం లిథియం – అయాన్ బ్యాటరీ తయారీ కేంద్రాన్ని ప్రధాని మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ.. 'ఈ లిథియం అయాన్ బ్యాటరీ తయారీ కేంద్రం భారతదేశం యొక్క మేక్ ఇన్ ఇండియాకు కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఇది భారత్ యొక్క మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్ లక్ష్యాల సాధనలో పెద్ద ముందడుగు' అని ఆయన అన్నారు. దేశంలో ప్రారంభమైన ఈ కేంద్రం ద్వారా భారత్ వంద దేశాలకు ఎలక్ట్రిక్ వాహనాలను ఎగుమతి చేయనుంది. గణేష్ ఉత్సవం రోజున ప్రారంభించిన ఈ కేంద్రం మేక్ ఇన్ ఇండియా కొత్త అధ్యాయంకు నాంది. ఈరోజు భారత్‌కు జపాన్ మధ్య స్నేహబంధానికి కొత్త కోణాన్ని అందిస్తోంది. ఒక విధంగా ఇరు దేశాల మధ్య స్నేహానికి 13 ఏళ్లు. అంటే టీనేజ్. ఈ వయసు రెక్కలు విప్పే కాలం. కలలు ఉద్భవించే కాలం. ఈరోజు మారుతి సుజుకి టీనేజ్ సంవత్సరాల్లోకి అడుగుపెడుతున్నందుకు సంతోషంగా ఉన్నాను. గుజరాత్ ముఖ్యమంత్రిగా నేనున్న సమయంలో 2012లో హన్సల్‌పూర్‌లో సుజుకి భూమిని కేటాయించాను. భారత్ విజయగాథకు బీజాలు 13 సంవత్సరాల క్రితమే నాటాము' అని అన్నారు. భారతదేశానికి ప్రజాస్వామ్యశక్తి, జనాభా ప్రయో జనమూ ఉన్నాయని మోడీ అన్నారు. దేశంలో నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి పెద్ద సంఖ్యలో ఉంది. ఇది ప్రతి భారతీయ భాగస్వామికి గెలుపును అందిస్తుందని ప్రధాని తెలిపారు. జపాన్‌కు చెందిన సుజుకీ భారత్‌లో ఉత్పత్తి చేస్తోంది. ఇక్కడ తయారైన కార్లను జపాన్‌కు తిరిగి ఎగుమతి చేస్తామని మోడీ పేర్కొన్నారు.

## ఆ పింఛన్ల కొనసాగింపుపై కీలక ఆదేశాలు..




ఆగస్టు 26,(టుడే విదుర): అర్హులైన వారందరి పింఛన్లు కొనసాగించాలని సీఎం నారా చంద్రబాబునాయుడు.. అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 18 వేల మందికి పెన్షన్ నిలిపేయడంపై ఏబీఎన్, ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అర్హత ఉన్న పెన్షన్లను తొలగించేందుకు నోటీసులు ఇచ్చారని ఏబీఎన్ లో కథనాలు వెలువడ్డాయి. తమ పెన్షన్ నిలిపేశారంటూ పెద్ద ఎత్తున ఏబీఎన్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. వచ్చిన నోటీసులను కూడా ఏబీఎన్‌కు పంపించారు. దీనిపై ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రసారమయ్యాయి. 18 సంవత్సరాలలోపు పిల్లలకు వైకల్యం ఉంటే. వారికి అధికారులు తాత్కాలిక దివ్యాంగుల సర్టిఫికేట్ ఇచ్చారు. 18 సంవత్సరాలలోపు శరీరంలో మార్పులు వస్తాయని.. అందువల్ల వారికి తాత్కాలిక సర్టిఫికెట్ ఇవ్వాలన్న కేంద్ర మార్గదర్శక సూత్రాల ప్రకారం తాత్కాలిక సర్టిఫికేట్ ఇచ్చిన 18 వేల మందికి అధికారులు పెన్షన్లు నిలిపివేశారు. ఈ మేరకు వారికి నోటీసులు జారీ చేయడంతో దివ్యాంగులు గగ్గోలు పెట్టారు. ఏబీఎన్ కథనాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకున్నారు. తాత్కాలిక సర్టిఫికేట్లు ఉన్నవారందరికీ పెన్షన్లు కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అంతకముందు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకున్నట్లు, పెన్షన్ కొనసాగిస్తున్నామంటూ దివ్యాంగులకు ఏపీ సెర్ప్ నుంచి మెజేస్‌లు వచ్చాయి. పెన్షన్ తొలగింపునకు నోటీసులు ఇచ్చిన 80 వేలమందిలో కూడా అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వాలన్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కథనాలతో సీఎం ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి స్వయంగా పరిశీలిస్తున్నామని, నిజంగా అర్హులైతే వారి పెన్షన్‌ను పునరుద్ధరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### సిట్ విచారించిన 300 మందిలో

## ఏ ఒక్కరూ నాకు తెలియదు




విజయవాడ:ఆగస్టు 26,(టుడే విదుర): ఏసీబీ కోర్టులో లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారవేత్త రాజ్ కసిరెడ్డి తనపై నమోదైన కేసును ఖండిస్తూ వివరణ ఇచ్చారు. కస్టోడియల్ విచారణ అని సిట్ తనన్ను అరెస్టు చేసిందన్నారు. లిక్కర్ స్కామ్ కేసులో తన పాత్ర ఎక్కడా లేదని, తన తప్పు లేకపోవడంతో తప్పు చేసినట్లుగా ఆధారాలు సృష్టించారని రాజ్ కసిరెడ్డి ఆరోపించారు. తనపై ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా లేదని, గతంలో కూడా ఏ కేసులోనూ తాను అరెస్టు కాలేదని స్పష్టం చేశారు. రూ. 11 కోట్లు నావే అయితే నా వేలిముద్రలు ఉంటాయి కదా? రూ. 11 కోట్లు క్యాష్ ఒకే వ్యక్తి దగ్గర ఉంటాయా? అని ప్రశ్నించారు. సిట్ అధికారులు సినిమా స్టోరీల కంటే ఎక్కువ కథలు చెబుతున్నారన్నారు. సిట్ విచారించిన 300 మందిలో ఏ ఒక్కరూ కూడా తనకు తెలియదని చెప్పారు. ఎవరో ఒక ఐదుగురిని విచారణ చేసి నేను తెలుసా అని మీరే అడగండని కోరారు. ఈ కేసులో చాలా మంది పేర్లు తాను తొలిసారిగా వింటున్నట్లు తెలిపారు.

### పశ్చిమగోదావరి కలెక్టరేట్ నిర్మాణంపై

## రఘురామ క్లారిటీ



పశ్చిమగోదావరి, ఆగస్టు 26,(టుడే విదుర):భీమవరం వేరు, ఉండి వేరుగా తాను చూడటం లేదని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. కొంత మంది సంకుచిత స్వభావంతో మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఇవాళ(మంగళవారం) పశ్చిమగోదావరి జిల్లాలో రఘురామ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ నిర్మాణంపై రఘురామకృష్ణరాజు మాట్లాడారు. నూతన పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడ్డాక కలెక్టరేట్ ఆఫీస్ అద్దె భవనంలో కొనసాగుతోందని తెలిపారు. మార్కెట్ యార్డులో కలెక్టరేట్‌కు స్థలం ఇచ్చారని.. అది ముందుకు వెళ్లలేదని క్లారిటీ ఇచ్చారు. రూ. 100 కోట్లు పెట్టి స్థలాన్ని ప్రభుత్వం కొన్నదని.. ఇప్పుడు కలెక్టరేట్ కట్టడం కష్టమని చెప్పుకొచ్చారు. పెద అమిరం గ్రామాన్ని భీమవరం మున్సిపాలిటీలో కలపడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు రఘురామకృష్ణరాజు.

## ఎకో గణపతి వరల్డ్ రికార్డ్



ఎన్టీఆర్ బ్యూరో,ఆగస్టు 26,(టుడే విదుర): 5000 మట్టి గణపతి విగ్రహాల తయారీతో విజయవాడ విద్యార్థులు వరల్డ్ రికార్డ్ సృష్టించారు. ఇందిరాగాంధీ స్టేడియంలో వివిధ కళాశాలల విద్యార్థులతో 2 వేల విగ్రహాల తయారు చేయగా.. మరో 10 విద్యా సంస్థలు మరో 3 వేల విగ్రహాల తయారీ చేశాయి. మట్టి గణపతి పూజించాల్సిన అవసరాన్ని వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే రీతిలో ఈ వినూత్న కార్యక్రమం జరిగింది. ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ ఎకో ఫ్రెండ్లీ గణేశా కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ కృష్ణయ్య, కలెక్టర్ లక్ష్మీశా, మున్సిపల్ కమిషనర్ ఙ్ఞాన్ చంద్ పాల్గొన్నారు.

### అల్పపీడనం ఎఫెక్ట్.. తెలుగు రాష్ట్రాల్లో

## భారీ వర్షాలు.. ఎప్పటివరకంటే..





అమరావతి, ఆగస్టు 26,(టుడే విదుర): వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వెంబడి అల్పపీడనం ఏర్పడిందని.. ఇది రాబోయే రెండు రోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదిలి మరింత బలపడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు.

### అవినీతిలో అనకొండ..

## అధికారిణిపై భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

తిరుపతి:ఆగస్టు 26,(టుడే విదుర): వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో అవినీతికి పాల్పడి అరెస్టు అయిన ఓ అధికారిణిపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యాలు చేశారు. ఆమె అవినీతిలో అనకొండ లాంటి అధికారి అని తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుపతిలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై మంత్రి నారాయణ చేసిన కామెంట్స్ నేపథ్యంలో భూమన కరుణాకర్ రెడ్డి స్పందించారు. ఓ వీడియోను విడుదల చేశారు. సదరు అవినీతి అధికారిణి గతంలో మంత్రులను సైతం పూచికపుల్లలా చూసిందన్నారు. కనీసం తన శాఖకు సంబంధించిన మంత్రులను కూడా లెక్క చేయదంటూ ఆమె తీరును తప్పుపట్టారు.

## లిక్కర్ స్కామ్‌లో నిందితులకు మళ్లీ రిమాండ్ పొడిగింపు



విజయవాడ, ఆగస్టు 26,(టుడే విదుర): మద్యం కుంభకోణం కేసులో నిందితులకు రిమాండ్ల పర్వం కొనసాగుతోంది. ఈ కేసులో 12 మంది నిందితులకు సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. ఈ మేరకు ఏసీబీ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రిమాండ్ పొడిగించిన నేపథ్యంలో 12 మంది నిందితులను వివిధ జైళ్లకు పోలీసులు తరలిస్తున్నారు. ఈ కేసులో వైసీపీ ఎంపీ పి. మిథున్ రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు. మిగిలిన 9 మంది నిందితులను విజయవాడ జైలుకు... అలాగే మరో ఇద్దరు నిందితులను గుంటూరు జైలుకు పోలీసులు తరలించారు.మరోవైపు ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు రాజ్ కసిరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమోదైన కేసును ఆయన ఖండించారు. కస్టోడియల్ విచారణ అని సెట్ తనను అరెస్ట్ చేసిందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో తన పాత్ర ఎక్కడా లేదని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## సుప్రీం సందిగ్ధత ఎన్నికలకు శాపం

ఎన్నికల కమిషన్ (ఈసీ) ఇంతగా వివాదాస్పదమై పలచనైపోయిన సందర్భం ఇంతకుముందు ఎప్పుడూ లేదనుకుంటాను. ఒకవైపు ఎన్నికలు చేరువలో ఉన్న బిహార్‌లో ఉన్నట్టుండి ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో చేపట్టిన కార్యక్రమం అభాసుపాలవుతున్నది. ఇంకొకవైపు ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పరిశోధించి బయటపెట్టిన భారీ దొంగ ఓట్ల బండారం ప్రజాస్వామ్యానికి పెనుముప్పును సూచిస్తూ కమిషన్ తలదించుకోవలసిన పరిస్థితిని కలిగించింది. ఈ రెండు ఉదంతాల్లోనూ అది కేంద్ర పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిపోయింది.%ఏ పార్టీ, లేదా ఏ శక్తి, వ్యక్తి ఒత్తిడికీ లొంగకుండా సర్వ స్వతంత్రంగా పని చేయడానికే ఈసీకి రాజ్యాంగ హోదా కల్పించారు. ఎన్నికల నిలువుటద్దంలో ప్రజల తీర్పును యథాతథంగా ప్రస్ఫుటింపజేయవలసిన గురుతర బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు దీనికి అప్పగించారు. అందుకు విరుద్ధంగా అది డూడూ బసవన్న అయిపోవడం ఎంతో ఆవేదన కలిగిస్తున్నది. శేషన్ హయాంలో మితిమించిన కాఠిన్యం, ఇప్పుడు శ్రుతిమించిన దాసోహం. ప్రజాస్వామ్యంలోని సున్నితత్వాన్ని హరించిన శేషన్‌ను భరించగలిగాం గాని, జ్ఞానేశ్ వెన్నెముకలేమి దుర్భరంగా ఉన్నదని ప్రజలు, విజ్ఞులు వాపోతున్నారు.రాజ్యాంగం 324 అధికరణ ఎన్నికల సంఘానికి ప్రాణం పోసింది. ఈ ఆర్టికల్ ప్రకారం పార్లమెంట్‌కు, రాష్ట్రాల శాసనసభలకు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు నిష్పాక్షిక, నిర్భయ వాతావరణంలో ఎన్నికలు జరిపించడం ఎన్నికల కమిషన్ ప్రధాన బాధ్యత. ఇంకా ఆయా ఎన్నికలకు ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడం, ఎన్నికల్లో పార్టీలకు ప్రవర్తనా నియమావళి (కోడ్) విడుదల చేయడం, అభ్యర్థుల ప్రచార ఖర్చుపై పరిమితి విధించడం, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల వంటి ఆధునిక సాంకేతిక సాధనాలను ప్రవేశపెట్టడం, నోటా మాదిరి విధానాలను చేర్చి ప్రజాస్వామ్య నైశిత్యానికి పదునుపెట్టడం, అభ్యర్థుల క్రిమినల్ నేపథ్యాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం ఎన్నికల కమిషన్‌కు గల ఇతర అధికారాలు. ఈ కమిషన్ 1950లో నెలకొన్నది. 1989లో ఓటింగ్ కనీస వయసును 21ఏళ్లకు బదులు 18 సంవత్సరాలు చేశారు. అప్పుడు తొలిసారిగా ఏకసభ్య కమిషన్ ముగ్గురు సభ్యుల వ్యవస్థగా మారింది. ఎన్నికల కమిషనర్లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఉండే జీతభత్యాలు, సర్వీస్ నిబంధనలు వర్తిస్తాయి. ఎన్నికల నిష్పాక్షికతను కాపాడి ఓటు పవిత్రతకు భంగం వాటిల్లకుండా చూడవలసిన అవసరాన్ని గుర్తించి ఎన్నికల సంఘాన్ని ఇంతటి ఉన్నత స్థానంలో ఉంచారు. ఇప్పుడు అందుకు విరుద్ధమైన పరిస్థితులు తలెత్తడం ఆందోళనకరం. ఎన్నికల కమిషన్ ఎంత నిష్పక్షపాతంగా ఉండాలో సుప్రీంకోర్టు అనేకసార్లు విశదీకరించింది. ఇంత ప్రాధాన్యం కలిగిన ఎన్నికల కమిషన్‌కు కమిషనర్లను నియమించే ప్రక్రియ చాలా కాలం పాటు కేంద్ర ప్రభుత్వం గుప్పెట్లో ఉంది. దానికి స్వస్తి చెప్పేందుకు సుప్రీంకోర్టు సాగించిన ప్రశంసాపాత్రమైన కృషి విఫలమై తిరిగి కేంద్రం గుత్తాధిపత్యానికే దారితీసింది. ఇదే ప్రస్తుత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌ను ఏరికోరి నియమించుకునే అధికారాన్ని మోదీ ప్రభుత్వానికి ఇచ్చింది.ఎన్నికల కమిషనర్లుగా సీనియర్ ఐఏఎస్‌లను, కేంద్ర కేబినెట్ సెక్రటరీలుగా పనిచేసిన వారిని, ఆ స్థాయి ఇతరులను నియమించేవారు. అందుబాటులోని ఇటువంటివారిలో తమకు ఇష్టులైన వ్యక్తులను సీఈసీలుగా, ఈసీలుగా ప్రధానమంత్రులు సిఫారసు చేయడం, వారిని రాష్ట్రపతి నియమించడం ఆనవాయితీగా చాలాకాలం పాటు కొనసాగింది. అయితే ఈ విధానాన్ని సవాలు చేస్తూ 2015లో రిటైర్డ్ ఐఏఎస్ అనూప్ బరన్వాల్ దాఖలు చేసిన జనహిత వ్యాజ్యం ఈ వ్యవహారాన్ని కీలకమైన మలుపు తిప్పింది. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ, ఎవరి జోక్యానికీ అతీతంగా, పారదర్శకంగా ఉండేలా చూడాలని ఈ పిటిషన్‌లో కోరారు. అప్పటికున్న నియామక విధానం ఎన్నికల స్వచ్ఛతను, నిష్పాక్షికతను హరిస్తున్నదని పిటిషనర్ వాదించారు. వాస్తవానికి ఎలక్షన్ కమిషనర్ల నియామకానికి అనుసరించవలసిన పద్ధతిని నిర్దేశిస్తూ పార్లమెంటు ప్రత్యేక చట్టాన్ని చేయాలని రాజ్యాంగం 342(2) 53(3)(బి)లు సూచిస్తున్నాయి. అటువంటి చట్టం లేకపోవడాన్ని ఆసరా చేసుకుని కేంద్ర పాలకులు ఇంతటి ముఖ్యమైన విషయంలో నిరంకుశంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఈ కేసును విచారణకు స్వీకరించిన జస్టిస్ కేఎం జోసెఫ్ ఆధ్వర్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2023లో తీర్పు ఇచ్చింది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి తగినవారిని రాష్ట్రపతికి సిఫారసు చేయడానికి ప్రధాని, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)తో ఒక కమిటీని వేయాలని స్పష్టం చేసింది. పార్లమెంటు ఒక చట్టం చేసేవరకు ఈ కమిటీ కొనసాగాలని చెప్పింది. స్వేచ్ఛతో కూడిన, స్వచ్ఛమైన ఎన్నికలకు నిష్పాక్షిక సీఈసీ అత్యంత అవసరమన్న ధర్మాసనం సందేశానికి విరుద్ధంగా కేంద్రం అతి తెలివిని ప్రదర్శించింది. కమిషనర్లుగా నియామకానికి తగినవారిని సిఫార్సు చేసే కమిటీ నుంచి సీజేఐని తొలగిస్తూ పార్లమెంటు చేత చట్టం చేయించింది. ఈ చట్టం ప్రకారం ప్రధాని, ఒక కేంద్రమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్ల నియామకానికి పేర్లను సిఫారసు చేస్తుంది. ఆ విధంగా కేంద్ర పాలకులు ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో తమ నిరంకుశ నిర్ణయానికి దారి చేసుకున్నారు. ఈ చట్టాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ మధ్యప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జయా ఠాకూర్ 2024 జనవరిలో సుప్రీంకోర్టులో దావా దాఖలు చేశారు. ఆ తర్వాత 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్' దీనిని (ఏడీఆర్) సవాలు చేసింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించింది.

# పలు రైళ్లకు కొండపల్లి హాల్ట్ తాత్కాలిక తొలగింపు

హైదరాబాద్ సిటీ:ఆగస్టు 26(టుడే విదుర): దక్షిణమధ్యరైల్వే పరిధిలో విజయవాడ మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్‌రైళ్లకు కొండపల్లి స్టేషన్‌లో హాల్ట్‌ను తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కొండపల్లి రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నందున హాల్ట్ తొలగింపు నిర్ణయం తీసుకున్నారు.ప్రధానంగా మచిలీపట్నం - విజయవాడ, బీదర్ వెళ్లే మచిలీపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికింద్రాబాద్ మధ్య నడిచే




గోల్కొండ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-అదిలాబాద్ మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్, విజయవాడ-భద్రాచలం , విజయవాడ- డోర్నకల్ మధ్య నడిచే మెమూ ప్యాసింజర్ రైళ్లకు అక్టోబర్ 19నుంచి నవంబర్ 18వరకు కొండపల్లి స్టేషన్‌లో హాల్ట్‌ను ఎత్తివేసినట్లు అధికారులు వెల్లడించారు.కాచిగూడ-మిర్యాలగూడ మెమూ (67775) ప్యాసింజర్ రాత్రి 7.30గంటలకు బదులు ఇకపై 7.40గంటలకు కాచిగూడ నుంచి బయల్దేరుతుందని అధికారులు తెలిపారు. అలాగే, కాచిగూడ-వాడి మధ్య నడిచే మెమూ(67786) ప్యాసింజర్ కాచిగూడ నుంచి రాత్రి 7.35గంటలకు బదులుగా పది నిమిషాలు ముందుకు మారిందని, 7.25గంటలకు బయల్దేరుతుందని రైల్వే అధికారులు వెల్లడించారు. సోమవారం నుంచే ఈ మార్పు అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు.

# విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు

ఒంగోలు, ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 26(టుడే విదుర): తెలుగు ప్రజల త్యాగాలతో ఏర్పాటై జాతికి గర్వకారణంగా, స్వావలంబనకు చిహ్నంగా ఉన్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. అందుకోసం తీసుకుంటున్న చర్యలను తక్షణం నిలిపివేయాలని కోరింది. ఒంగోలులో జరుగుతున్న పార్టీ 28వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి, ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుపై చర్చించి తీర్మానాలు చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకుడు ఎం.ఆదినారాయణ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రంలో కోనేరు రంగారావు కమిటీ సిఫారసులకు అనుగుణంగా పేదలకు భూ పంపిణీ చేయాలని, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ మహాసభ తీర్మానించింది. రాష్ట్రంలో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి, సౌకర్యాలు కల్పించాలని మహాసభ కోరింది. లులూ సంస్థకు ఆర్టీసీ స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం తెచ్చిన 133 జీవోను తక్షణం రద్దు చేయాలని, స్త్రీ శక్తి (ఉచిత బస్సు) పథకం విజయవంతానికి 3వేల కొత్త బస్సుల కొనుగోలు చేయాలని, పది వేల మంది సిబ్బందిని నియమించాలని, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలని, నీటి హక్కులకు భంగం కలగకుండా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని మహాసభ కోరింది. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమని, దానిని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. రాజధాని అమరావతి నిర్మాణానికి అదనపు భూసేకరణను వ్యతిరేకించింది. మహాసభలో మొత్తం 64 తీర్మానాలు చేశారు.మహాసభ ముగింపు సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగ వ్యవస్థలను చెప్పుచేతల్లో పెట్టుకొని పాలిస్తోందని ధ్వజమెత్తారు. సీపీఐ స్వతంత్ర బలం పెంచుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా రాష్ట్రంలో పార్టీ పటిష్ఠత, విస్తరణపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. 'బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ సీపీఐ ఇన్




ఆంధ్రప్రదేశ్' పేరుతో రచించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా రాజా ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో డి.రాజా మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితిలోకి వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ రాజకీయ కారణాలతో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేశారో ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పహల్గాం ఉగ్రదాడిని కూడా రాజకీయం చేస్తున్నారని, ట్రంప్ డైరెక్షన్‌లో మోదీ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. స్వతంత్రంగా ఉండాల్సిన ఎన్నికల కమిషన్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం తన గుప్పెట్లో పెట్టుకుని ప్రజల ఓటు హక్కును కాలరాస్తోందని ధ్వజమెత్తారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సెప్టెంబరు 1న బిహార్‌లో పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు.

# విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ధర్నా




ఆగస్టు 26(టుడే విదుర): విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. స్థానిక బాలాజీ చెరువు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేస్తుందని అన్నారు. ఈ విధానాల వల్ల విద్య కేంద్రీకరణ, కాషాయీకరణ, ప్రైయివేటీకరణ అవుతుందని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో పూర్తిగా అమలు చేయని ఈ విధానాన్ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎన్నికల ముందు విద్యారంగాన్ని సమూలంగా మార్పులు చేస్తామని చెప్పిన కూటమి పార్టీల నేతలు అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం చేసిన విధానాలనే అమలు చేస్తుందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురియం బర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని, దీనివల్ల ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యా ర్థులను పరీక్షలు రాయినివ్వడం లేదన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. సంక్షేమ వసతి గృహాలకు చెందిన కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, కొన్ని అద్దె భవనాల్లో అరకొరా సౌకర్యాలతో ఉన్నాయని అన్నారు. 2018లో ఇచ్చిన మెనూనే నేటికీ అమలు చేయడం దారుణమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను రూ.3 వేలకు పెంచాలని, కాస్మోటిక్ ఛార్జీలు ప్రతి నెల ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఇరుకు గదుల్లో విద్యా బోధన

వీరఘట్టం :ఆగస్టు 26(టుడే విదుర): కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ప్రభుత్వాలు ఆర్భాటంగా ప్రచారాలు చేస్తున్నయే తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా ఉంది సర్కారు బడుల్లో సమస్యలు కొలువై ఉన్నాయి. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో గల యు.వెంకంపేటలో మోడల్ ప్రైమరీ పాఠశాల ఉంది. ఇందులో సుమారు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 23 మంది విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారు. గ్రామానికి నడి బొడ్డున ఈ పాఠశాల ఉంది.ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఒకరు లోపల, మరొకరు ఆరుబయట విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారు. మరోవైపు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు వీలుగా వంటగది నిర్మించేందుకు స్థలం లేకపోవడంతో బోధన చేసిన గదిలోనే ఓ మూలన మధ్యాహ్న భోజనాన్ని నిర్వాహకులు సమకూరుస్తున్నారు. అంతేకాకుండా భోజనం అనంతరం విద్యార్థులు చేతులు, ప్లేట్లు కడుక్కునేందుకు వీలుగా ఏ విధమైన సదుపాయం లేకపోవడంతో పాఠశాలకు ఆనుకుని ఉన్న మరుగుదొడ్లులో వద్ద తినే ప్లేట్లను శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. విశ్రాంత సమయంలో విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు వీలుగా స్థలం లేకపోవడంతో పాటు రహదారికి పక్కన ఉన్నందున ఏ సమయంలో ఎటువంటి ప్రమాద వార్త వినాల్సి వస్తుందోనని ఉ



పాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం కూడా పూర్తిస్థాయిలో శిథిలావవస్థకు చేరుకోవడంతో అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల వల్ల శ్లాబ్‌పై నుంచి వర్షం నీరు కిందకి జారడంతో గోడలు బీటలు వారడంతో పాటు అక్కడక్కడ శ్లాబ్ పెచ్చులూడి దర్శనమిస్తుంది. గ్రామంలో అదనపు పాఠశాల భవనం లేకపోవడంతో ఒకే వరలో రెండు కత్తుల అన్నట్టు ఇరుకైన గదిలో బోధించడం వల్ల పాటలు చెప్పే ఉపాధ్యాయులకు ఏం చెబుతున్నారో, విద్యార్థులు ఏం వింటున్నారో అర్థం కాని స్థితిలో ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


# ఎరువుల దుకాణలపై విజిలెన్స్



**కె.కోటపాడు మండలం సంతపాలెంలో అనుమతి లేకుండా ఎరువుల అమ్మకాలు**
**%విజిలెన్స్, వ్యవసాయ శాఖల అధికారుల దాడులు**
**వివిధ రకాలకు చెందిన 620 బస్తాల నిషేధిత ఎరువులు సీజ్**
**వ్యాపారిపై కేసు నమోదు**
**జిల్లాలో ఎరువుల షాపులు, గోదాముల్లో విస్తృతంగా తనిఖీలు**

అనకాపల్లి/ కె.కోటపాడు, ఆగస్టు 26(టుడే విదుర): రసాయన ఎరువులను బ్లాక్ చేసి, తెరచాటున ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు అందిన ఫిర్యాదులపై జిల్లా అధికారులు స్పందించారు. జిల్లాలో ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రయ దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖల అధికారులు దాడులు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. లైసెన్స్ లేకుండా ఎరువులు విక్రయించడంతోపాటు నిషేధిత ఎరువులు అమ్ముతున్నట్టు గుర్తించారు. ఎరువులను సీజ్ చేసి, దుకాణదారులపై కేసులు నమోదు చేస్తున్నారు.జిల్లాలో కొద్ది రోజుల నుంచి సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో దమ్ము పనులు, వరినాట్లు ఊపందుకున్నాయి. ఈ సమయంలో రైతులు తప్పకుండా రసాయన ఎరువులు వినియోగిస్తారు. దాదాపు 80 శాతం మంది రైతులు ప్రస్తుతం వరినాట్లు వేస్తుండడంతో రసాయన ఎరువులకు గిరాకీ ఏర్పడింది. ఇదే అదనుగా భావించిన పలువురు వ్యాపారులు కృత్రిమంగా ఎరువుల కొరతను సృష్టించి, బ్లాకులో ఎక్కువ రేటుకు అమ్ముతున్నారు. మరికొంతమంది వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి ఇన్‌వాయిస్‌లు లేకుండా, నిషేధ ఎరువులను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. వీటిపై రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం స్పందించింది. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖల అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల కిందట చోడవరంలోని శ్రీలక్ష్మీదేవి ఎరువుల దుకాణంలో ఒక కంపెనీకి చెందిన తక్కువ ధర ఎరువులను, అదే కంపెనీకి చెందిన ఎక్కువ ధర గల ఎరువుల సంచుల్లోకి మార్చి రైతులను మోసగిస్తున్నట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. తాజాగా కె.కోటపాడు మండలం కె.సంతపాలెంలోని గాయత్రి ఎరువుల దుకాణంలో వ్యవసాయాధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఇక్కడ లక్షలాది రూపాయల విలువచేసే నిషేధిత, నకిలీ ఎరువులను గుర్తించారు. ఎన్‌పీకే 17-17-17 రకం ఎరువు 200 బస్తాలు, ఎన్‌పీకే 19-19-19 రకం ఎరువు 220 బస్తాలు, ఎంఓపీ ఎరువు 60 బస్తాలు, 20-20-20 రకం ఎరువు 60 బస్తాలు, భూశక్తి ఎరువు 60 బస్తాలు మొత్తం 620 బస్తాలను సీజ్‌చేశారు. వీటి విలువ రూ.8.42 లక్షలు వుంటుందని, ఈ ఎరువులను దుకాణదారుడు హైదరాబాద్‌లోని వెంకటేశ్వర ఆగ్రోస్ అండ్ ఫెర్టిలైజర్స్ కంపెనీ నుంచి కొనుగోలు చేసి, ఇక్కడకు రప్పించినట్టు అధికారుల విచారణలో తేలింది. ఎరువుల దుకాణం నిర్వాహకుల్లో కింతాడ హరీశ్‌పై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన ఎరువుల బస్తాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ టి.అప్పలనాయుడు, ఎస్‌ఐ రవికుమార్, వ్యవసాయ అధికారి ఎంవీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి జిల్లాలో ఎరువుల దుకాణాలపై తనిఖీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు ప్రతినిధికి తెలిపారు. నకిలీ ఎరువులు విక్రయిస్తున్నట్టు రుజువైతే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు.

# చిట్వేలి అడవిలో పెద్దపులి



మంగళం(తిరుపతి)/రైల్వేకోడూరు రూరల్/చిట్వేలి, ఆగస్టు 26(టుడే విదుర): కడప జిల్లా చిట్వేలి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్టు అటవీ శాఖ వన్యప్రాణి విభాగం గుర్తించింది. దీంతో తిరుమల అడవుల్లోకి కూడా పెద్దపులి అడుగుపెట్టి ఉండచ్చని అంచనా వేస్తున్నారు. చిట్వేలి రేంజ్ పరిధిలో 30 ట్రాప్ కెమెరాలను ఇటీవల ఏర్పాటు చేయగా... రాత్రి సమయంలోనే కాక, పగటి పూట కూడా స్వేచ్ఛగా పెద్దపులి తిరుగుతున్న దృశ్యాలు కనిపించాయి .రెండు లేదా మూడు పులులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు భావిస్తున్నారు. శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు నుంచి నల్లమల శేషాచలం కారిడార్ ద్వారా ఇవి చిట్వేలి ప్రాంతానికి చేరుకుని ఉండవచ్చని అంటున్నారు.

# ఆయుష్‌కు ఆదరణ పెరుగుతోంది

ఏలూరు అర్బన్, ఆగస్టు 26(టుడే విదుర): ఆయుష్ శాఖల వైద్య విధానాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ప్రజల నుంచి వీటికి ఆదరణ లభిస్తోందని ఆయుర్వేద విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ సాయి సుధాకర్, యునాని అసిస్టెంట్ డైరెక్టర్ వై.శేఖర్ చెప్పారు. ఈ వైద్య విధానంలో చేపట్టిన సంస్కరణలు, విస్తరణలో భాగంగా జోన్-2 పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, రిటైల్ షాపుల నిర్వహణ, రెన్యువల్స్ కోసం ఏలూరులో మేళా నిర్వహిస్తున్నారు. జరిగిన మేళాలో సాయి సుధాకర్, వై.శేఖర్ మాట్లాడారు. చిత్తూరు, ధర్మవరం, కాకినాడల్లో ప్రైవేటు రంగంలో కొత్తగా ఆయుర్వేద కళాశాలలు స్థాపించే ప్రతిపాదనలు ఉన్నాయని సాయి సుధాకర్ చెప్పారు. ఆయుర్వేద వైద్యం పొందినవారు వైద్య ఖర్చులను తిరిగి పొందేందుకు ఉద్దేశించిన చట్టాన్ని అసెంబ్లీ ఆమోదించిందని, దీనివల్ల వైద్య ఖర్చులను ప్రైవేటు ఆయుర్వేద క్లినిక్‌లకు ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోందని తెలిపారు. అమరావతి పరిధిలోని మూలపాడు వద్ద 200 ఎకరాల విస్తీర్ణంలో



హెర్బల్ మెడిసినల్ ప్లాంట్, ల్యాబ్ స్థాపనకు మెడిసినల్ ప్లాంట్ బోర్డుతో ఒప్పందం జరిగిందని తెలిపారు. విజయవాడ సమీపంలోని కాటూరి మెడికల్ కాలేజీ పక్కన 10 ఎకరాల విస్తీర్ణంలో నేచరోపతి రీసెర్చి స్టేషన్ ఏర్పాటుకు కేంద్రం రూ.100 కోట్లు మంజూరు చేసిందన్నారు.

# పదోన్నతుల్లో రిజర్వేషన్లపై సుప్రీం తీర్పు అమలుచేయాలి

అమరావతి,ఆగస్టు 26(టుడే విదుర): పదోన్నతుల్లో రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు తీర్పును అనుసరించాలని ఆలిండియా ఈక్వాలిటీ ఫోరం సెక్రటరీ శ్రీనివాస్, సచివాలయ బీసీ, ఓసీ సంఘ నాయకులు రాజేశ్ డిమాండ్ చేశారు. వారు సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఐఏఎస్ అధికారుల కమిటీ ఇన్షియల్ క్యాడర్ ప్రాతిపదికగా ప్రమోషన్లలో రిజర్వేషన్ అంశాన్ని పునఃసమీక్షించి, తదనుగుణంగా రివైజ్డ్ ప్యానెల్స్ రూపొందించాలని నివేదిక ఇచ్చిందన్నారు.



అయితే ఇప్పుడు కొందరు అధికారులు ఆ రిపోర్టులోని ఇన్షియల్ క్యాడర్ పదాన్ని మార్చి ఫీడర్ క్యాటగిరీ ప్రాతిపదికగా తీసుకోవాలని సవరించి మంత్రివర్గ ఉప సంఘానికి ఇచ్చి తప్పు దోవ పట్టించినట్టు తెలిసిందని చెప్పారు.

# ఇంజనీరింగ్ కాలేజీల్లో నో డిగ్రీ



%అమరావతి ఆగస్టు 26(టుడే విదుర):సాంకేతిక విద్యాశాఖ నిర్వాకం కారణంగా ఈ ఏడాది ఇంజనీరింగ్ కాలేజీల్లో బీబీఏ, బీసీఏ కోర్సుల అడ్మిషన్లకు అనుమతి లభించలేదు. గత రెండేళ్లుగా ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ డిగ్రీ కోర్సులకు అనుమతులు వచ్చాయి. ఏఐసీటీఈ నుంచి అనుమతులు పొందిన ఇంజనీరింగ్ కాలేజీలు బీబీఏ, బీసీఏ కోర్సులను ప్రవేశపెట్టాయి. ఆ రెండు కోర్సులకు ఏఐసీటీఈ నుంచి అనుమతులు వచ్చాక సాంకేతిక విద్యాశాఖ ఆ కాలేజీలు, కోర్సుల జాబితాను ఉన్నత విద్యామండలికి ఇవ్వాలి. కానీ ఆ వివరాలను మండలికి ఇవ్వలేదు. దీంతో ఆ కాలేజీల్లో బీబీఏ, బీసీఏ కోర్సులను ఆప్షన్లలో పెట్టకపోవడంతో అడ్మిషన్లు నిలిచిపోయాయి. సాంకేతిక విద్యాశాఖ స్పందించని కారణంగా ఇప్పుడు ఆ ఇంజనీరింగ్ కాలేజీలు అడ్మిషన్ల జాబితాలో లేకుం డా పోయాయి. దీంతో ఆ రెండు కోర్సులు కోరుకునే విద్యార్థులకు నిరాశ ఎదురవుతోంది. బీబీఏ, బీసీఏ కోర్సులకు ఇప్పుడు డిమాండ్ భారీగా ఉంది. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ సీటు రానివారు బీసీఏ కోర్సుకు మొగ్గు చూపుతుండగా.. బీబీఏ కోర్సులకూ డిమాండ్ పెరిగింది.మరోవైపు డిగ్రీ అడ్మిషన్ల వ్యవహారంలో ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఒకే శాఖలోని రెండు విభాగాలు ఎవరి దారి వారిదే అన్నట్టుగా వ్యవహరిస్తుండడంతో అడ్మిషన్లపై ప్రతికూల ప్రభావం పడుతోంది. డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు మాత్రమే అనుమతి ఇచ్చింది. ఆ తర్వాత రెండు రోజులకు కాలేజీ లాగిన్ ద్వారా కూడా అడ్మిషన్లు చేపట్టే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది.

# ఫోన్‌లో ఆర్డర్ చేస్తే గంజాయి డెలివరీ



అనంతపురం క్రైం,ఆగస్టు 26(టుడే విదుర): ఫోన్‌లో ఆర్డర్ చేసి, గంజాయి తెప్పించి విక్రయిస్తున్న ముగ్గురిని అనంతపురం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 8.291 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎక్సైజ్ ఎన్‌పోర్స్‌మెంట్ సీఐ లక్ష్మి సురేఖ, ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ వెల్లడించారు. గత నెల 18న టీవీ టవర్ ప్రాంతంలో తనిఖీలు చేయగా, 418 గ్రాముల గంజాయి దొరికింది. నిఘా ఉంచిన పోలీసులు ఎన్టీఆర్ కాలనీ సమీపంలోని మసీదు దగ్గర బుడ్డప్ప నగర్‌కు చెందిన షికారి నాగమణి, ఎన్టీఆర్ కాలనీకి చెందిన షికారి శీనా, వెంగమనాయుడు కాలనీకి చెందిన షికారి జునను అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

# మనుషులు చేసిన దేవుడు!

ఆగస్టు 26(టుడే విదుర):మెళియాపుట్టి గ్రామానికి చెందిన బూరగాన రాములు గత 30ఏళ్ల నుంచి మట్టిని నమ్ముకుని వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. వినాయకచవితి, దసరా పండుల సమయాల్లో మట్టితో దేవుడి ప్రతిమలు చేసి విక్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లో ప్రమిదలు, కుండలు తయారు చేసి.. వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. కొంతమంది గిట్టుబాటు కాక కులవృత్తిని వీడి వివిధ వ్యాపారాలు చేస్తున్నా.. రాములు మాత్రం కులవృత్తిని వదలలేదు. తన వారసులు సైతం మట్టి విగ్రహాల తయారీ కొనసాగిస్తున్నారు.మట్టి వినాయక విగ్రహాల



తయారీకి మెళియాపుట్టి కేరాఫ్‌గా నిలుస్తోంది. ఈ గ్రామంలో బూరగాన రాములు, రేకాన దాలయ్య, వంజరాపు రమణ, వంజరాపు కృష్ణ ఇలా.. సుమారు పది కుమ్మరి కుటుంబాలు వినాయకుడు, దుర్గాదేవి విగ్రహాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. పర్యావరణహితం కోరేలా.. మట్టితో ఆకర్షణీయంగా వినాయక విగ్రహాలు రూపొందిస్తున్నాయి. వినాయకచవితి వస్తే ఆ కుటుంబాలకు పండుగే. మట్టి ప్రతిమలకు డిమాండ్ ఉండడంతో చాలామంది విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. విగ్రహాలు ఆకర్షణీయంగా ఉండడంతో ఒడిశా రాష్ట్రం నుంచి కూడా కొంతమంది వచ్చి కొనుగోళ్లు చేస్తున్నారు. విగ్రహం సైజును బట్టి రూ.3వేల నుంచి రూ.10వేల వరకు విక్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లో కులవృత్తి గిట్టుబాటుకాకపోయినా పండుగల సమయంలో తమకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆ దేవుడే ఆదుకుంటున్నాడని ఆయా కుటుంబాలు పేర్కొంటున్నాయి.



# ఉపాధి మార్గంలో మహిళలు రయ్.. రయ్

**♦ మెప్మా సహకారం, ర్యాపిడో చొరవ ♦ సబ్సిడీపై పట్టణ మహిళలకు టూ, త్రీ వీలర్లు**

**♦ 9 నగరాల్లో వెయ్యికిపైగా లబ్ధిదారులు వాహనాలతో రైడ్లు వేస్తూ ఆదాయార్జన**

**♦ మూడు నెలల్లో రూ. 35 లక్షల ఆదాయం**

**♦ మహిళా సాధికారతకు కృషి: లోకేశ్**

ఆగస్టు 26(టుడే విదుర): ఆర్థిక సమస్యలతో ఇల్లు గడవడం లేదు.. నేనూ కుటుంబానికి ఆసరాగా ఉంటే బావుండును అని ఆలోచిస్తున్న పట్టణ ప్రాంత మహిళలకు మెప్మా(మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్) చేదోడుగా నిలుస్తోంది. డ్వాక్రాతో దేశానికి ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర మహిళలు, ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాలతో ప్రయాణికుల గమ్య స్థానాలకు చేరుస్తూ ఆర్జిస్తున్నారు. మెప్మా, ర్యాపిడో సహకారంతో స్వయం ఉపాధి పొందుతున్నారు. ఈ ఉపాధి కార్యక్రమానికి మా ర్చి 8న, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తొలి అడుగు పడింది. అదే రోజున సీఎం చంద్రబాబు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదలైంది. ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త కింద మెప్మా సంస్థ ర్యాపిడో ద్వారా మహిళలకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించింది. అందులో తొలి దశలో తొమ్మిది పట్టణాల్లో వెయ్యి మంది లబ్ధిదారులకు రుణ సౌకర్యం కల్పించారు. వీటిలో విశాఖపట్నంలో 400 వాహనాలు, విజయవాడలో 400, నెల్లూరు, గుంటూరులో 50 చొప్పున, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రిలో 25 వాహనాలు చొప్పున మహిళలకు అందజేశారు. వాటిలో 760 ఎలక్ట్రిక్ టూ-వీలర్లు కాగా, 240 ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు ఉన్నాయి. మొత్తంగా ఇప్పటి వరకు వెయ్యికి పైగా కుటుంబాలు లబ్ధి పొందగా, వారిలో 688 మంది ర్యాపిడోలో నమోదయ్యారు.డ్వాక్రా, మెప్మా సహకారంతో.. వాహనాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన బ్యాంకు రుణాలు డ్వాక్రా సంఘాల మహిళల పేర్లతో మంజూరయ్యాయి. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వారి కుటుంబ సభ్యులు వాహనం నడిపేందుకు అవకాశం కల్పించారు. అవసరమైన ప్రాజెక్టు రిపోర్టులను మెప్మా సిద్ధం చేసి, జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు సహకారం అందించింది. ఈ క్రమంలో ర్యాపిడో సైతం మహిళలకు సాధికారత అందించడంలో భాగస్వామ్యమైంది. కొత్తగా చేరిన వారికి ప్లాట్‌ఫామ్ ఫీజులో మూడు నుంచి నాలుగు నెలల మినహాయింపు ఇచ్చింది. అలాగే తొలి సంవత్సరం టూ-వీలర్, త్రీవీలర్ యజమానులకు నెలకు రూ. వెయ్యి చొప్పున ఈఎంఐ మొత్తాన్ని సాయంగా అందించారు. దీంతో ర్యాపిడో నడపటం ప్రారంభించిన గృహిణులకు తొలిరోజు నుంచే ఆదాయం ప్రారంభమైంది. అలాగే ఈఎంఐ, ఇంధన భారం కూడా తగ్గింది.మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎలక్ట్రిక్ స్కూటర్, ఆటోలకు రూ. 12,300 నుంచి రూ. 36 వేల వరకు సబ్సిడీ అందిస్తోంది. ర్యాపిడోలో వాహనం నడుపుతున్న మహిళలు నెలకు సుమారు రూ. 13 నుంచి రూ. 16 వేల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. మే, జూన్, జులై నెలల్లో రికార్డు స్థాయిలో మహిళలు 45 వేల రైడ్లు పూర్తి చేశారు. మొత్తంగా రూ.35 లక్షల ఆదాయం సంపాదించారు. మహిళల విజయగాథల స్ఫూర్తి తో రాబోయే ఏడాదిలో మరో 4,800 మందికి ఈ పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.విజయవాడకు చెందిన వడ్లపడి గ్లోరీ మంజు మార్చిలో ప్రభుత్వ సబ్సిడీతో స్కూటర్ కొని ర్యాపిడో నడపడం ప్రారంభించారు. ప్రస్తు తం నెలకు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నారు. ఈఎంఐ చెల్లిస్తూ, కొంత సొమ్మును పొదుపు చేస్తున్నానని మంజు చెబుతున్నా రు. విజయవాడలోని కండ్రిక ప్రాంతానికి చెందిన మాధవి తన భర్తకు పక్షపాతం రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా రు. భర్తకు వచ్చే రూ.6 వేల దివ్యాంగ పింఛన్ మందులకే సరిపోతుండటంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. ఈ సమయం లో మెప్మా ద్వారా రుణం పొంది టూ-వీలర్ కొన్నానన్నారు. నెలకు రూ.12 వేల వరకూ సంపాదిస్తున్నా అని చెప్పారు. విజయవాడకు చెందిన భవానీ భర్త అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితమయ్యారు. ఇంటి బాధ్యతను తలకెత్తుకున్న భవానీ.. మెప్మా అధికారుల సహకారంతో రూ.1.20 లక్షల విలువైన ఈ-స్కూటర్ కొనుగోలు చేసి ర్యాపిడోలో చేరారు. ప్రస్తుతం రోజుకు రూ. 500-700 వరకు సంపాదిస్తున్నారు.మహిళల సాధికారతే ప్రభుత్వ ఆలోచన అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ మహిళలకు అన్ని రంగాల్లో ప్రోత్సాహాన్ని ఇస్తోందన్నారు. ర్యాపిడో కలిసి రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా మహిళలు స్వయం ఉపాధి సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో మహిళా సాధికారతకు మరింత కృషి చేస్తామని మంత్రి వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో యాచకురాలి మృతి

జి.సిగడాం,ఆగస్టు 26(టుడే విదుర): వాం డ్రంగి పంచాయతీ చీడిపేట కూడలి వద్ద వేకువ జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలు బలగ భాగ్యలక్ష్మి (50) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదాన్ని చూసి తట్టుకోలేక తోటి యాచకుడు కోటి (65) ఒక్కసారి కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటనలు స్థానికంగా విషాదం నింపాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి, ఒడిశా రాష్ట్రానికి చెందిన కోటి కొన్నాళ్లుగా స్థానిక చీడిపేట పాతబస్టాండ్ సమీపంలో ఉన్న ఆలయం వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే సోమ వారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో భాగలక్ష్మిని గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ వై.మధుసూదన రావు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆమె మృతి ఘటన చూసిన కోటి కూడా ఒక్కసారి బస్ షెల్టర్ వద్ద కుప్పకూలి మృతి చెందాడు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# గంజాయి తెచ్చి.. ప్యాకెట్లలో విక్రయించి..



రణస్థలం ఆగస్టు 26(టుడే విదుర): ఆ యువకులు గంజాయి మత్తుకు బానిసయ్యారు. ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి తెచ్చి.. ప్యాకెట్లుగా తయారుచేసి స్నేహితులకు విక్రయించేవారు. ఈ క్రమంలో మొత్తంగా పది మంది యువకులు జేఆర్ పురం పోలీసులకు చిక్కారు. జేఆర్ పురం పోలీసు స్టేషన్‌లో సీఐ ఎం.అవతారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామానికి చెందిన బగాన పవన్‌కుమార్, పూసపాటిరేగ మండలం కొత్త కొప్పెర్లకు చెందిన ఇనకోటి ముకుంద, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా మొలగాడకు చెందిన గుంత శుక్ర, శ్రీకాకుళం పెద్దరెల్లి వీధికి చెందిన తుపాకుల అనిల్‌కుమార్, ఎచ్చెర్లకు చెందిన లక్కవరపు పవన్‌కుమార్ నుంచి 22.483 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. శనివారం బాగాన పవన్‌కుమార్, ఇనాకోటి ముకుంద కలిసి ద్విచక్రవాహనంపై ఒడిశా రాష్ట్రం కోరాపుట్ దగ్గర పొత్తంగి వెళ్లి గుంత శుక్ర వద్ద 22.5 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. కిలో రూ.7వేలు చొప్పున కొనుగోలు చేసి.. ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించారు. ఈ గంజాయిని అరకేజీ చొప్పున ప్యాకెట్లుగా తయారుచేసి వారు స్నేహితులకు విక్రయిస్తారు. ఈక్రమంలో ఆదివారం పైడిభీమవరంలోని టౌన్‌షిప్ వద్దకు వీరు చేరుకుని, గంజాయి తాగి, గంజాయి ప్యాకెట్లను పంచుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్న బాడాన సౌమిత్‌కు, బెంగుళూరులో ఉన్న ఎం.సందీప్‌కు గంజాయిను విక్రయించే క్రమంలో వీరు పోలీసులకు పట్టుబడ్డారు. అలాగే గంజాయి తాగడానికి అలవాటు పడిన లంకలపల్లి దినేష్, ఆళ్ల వెంకటరమణ, సురవరపు వరప్రసాద్, బీ.వీ.వెంటప్రతాప్, ముడిల మోహన్‌వెంకటప్రతాప్‌పై కూడా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ అవతారం తెలిపారు. మొత్తంగా పదిమందిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించడంలో ప్రతిభ చూపిన సీఐ ఎం.అవతారం, ఎస్ఐలు ఎన్ చిరంజీవి, జి.లక్ష్మణరావు, ఏఎస్ఐ ఎన్.ఉమామహేశ్వరరావు, హెచ్‌సీ కె.కిరణ్‌కుమార్‌సింగ్‌ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

# మెంటాడను మన్యంలో కలపొద్దు



విజయనగరం టౌన్, ఆగస్టు 26(టుడే విదుర):మెంటాడ మండలాన్ని ఎప్పటిలాగే విజయనగరం జిల్లాలో కొనసాగించాలని, మన్యం జిల్లాలో కలపొ ద్దని విజ్ఞప్తి చేస్తూ ఆ మండల జేఏసీ నాయకులు కలెక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను కోరారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. మెంటాడను మన్యంజిల్లాలో కలుపుతారని ఎవరు చెప్పారంటూ ఎదురు ప్రశ్నించారు. అటువంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ఈ కార్యక్ర మంలో జేఏసీ నాయకులు, సభ్యులు గెద్ద అన్నవరం, రెడ్డి సన్యాసినాయుడు, రాయపల్లి రామారావు, లెంక రత్నాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# టమోటాకు తెగుళ్ల బెడద



ముదిగుబ్బ,ఆగస్టు 26(టుడే విదుర): రైతులు రూ.లక్షలు ఖర్చుపెట్టి సాగుచేసిన టమాటా పంట ఎడతెరిపి లేని వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. ఆకులు, కా యలపై నల్లమచ్చలు, తెగుళ్లు వ్యాపించడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో 1,150 ఎకరాల్లో టమోటా సాగైనట్లు అధికారు ల లెక్కలు చెబుతుం డగా, అనధికారికంగా మరో 500 ఎకరాల్లో సాగైంది. మే నెలాఖరు, జూనలో సాగుచేసిన పంటలను ప్రస్తుతం కోత కోస్తుండగా, జూలైలో సాగైన పంట లు పూత దశలో ఉన్నాయి. వర్ష ప్రభావంతో కాయలపై నల్లమచ్చలు అధికంగా రావడంతో రైతులు మార్కెట్‌కు తరలించ లేకపోతున్నారు. అలాగే వదిలేస్తే తోట మొత్తం తెగుళ్లు వ్యా పిస్తాయని కూలీలతో కాయ లు తొలగిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఆగస్టు మొదటి వారం నుం చి టమాటా ధరలు కాస్త పెరిగాయి. 30 కిలోల బాక్సు ధర రూ. 800 నుంచి రూ. 1000 వరకు పలుకుతోంది. ముదిగుబ్బ, కదిరి ప్రాంతాల నుం చి అధికంగా మదనపల్లి టమోటా మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. తెగుళ్లతో కాయ నాణ్యత తగ్గ డంతో మార్కెట్‌లో తక్కు వ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గుతోందని, రానుపోను రవాణా ఖర్చులకు సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు.

వాతావరణంలో అధిక తేమ వల్ల తెగుళ్లు - అమరేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి

వాతావరణంలో అధిక తేమతో ఆకుమచ్చ తెగులు వ్యాపిస్తోంది. లీటరు నీటికి 3 గ్రాముల మాంకోజీబ్ లేదా 3 గ్రాముల క్లోరో తలోనిల్ కలిపి పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆశించకుండా 10 లీటర్ల నీటికి 5 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ లేదా 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, గ్రాము స్ట్రెప్టో సైక్లిన మందును కలిపి పిచికారి చేయాలి.

# శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలి



ఖాజీపేటఆగస్టు 26(టుడే విదుర): ప్రతి ఒక్కరు శాంతియుతంగా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఖాజీపేట పోలీసు స్టేషన్‌లో గ్రామాల్లోని కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాల వద్ద శాంతియుతంగా పూజలు చేసుకోవాలన్నారు. ఇష్టానుసారంగా డీజేలు, డ్యాన్సులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఒకే గ్రామంలో రెండు ప్రతిమలు ఏర్పాటుచేస్తే ఒకటి ఉదయం, మరొకటి సాయంత్రం నిమజ్జనం జరిగేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడైనా రికార్డింగ్ డ్యాన్స్‌లు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిస్తే ప్రజలు సహకరించి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్, సిబ్బంది, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ఘరానా మోసం.. ఏం జరిగిందంటే..




ఆగస్టు 26(టుడే విదుర):ఫిలింనగర్‌లో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. కుదువ పెట్టిన నగలతో ఉండాయించాడు సదరు వ్యాపారి మాణిక్ చౌదరి . ఫిలింనగర్‌లో మాణిక్ జ్యూవెలరీస్ పేరుతో నగల అమ్మకాలు, కుదువ వ్యాపారాన్ని మాణిక్ చేస్తున్నాడు. వ్యాపారి దగ్గర నగలు కుదువ పెట్టారు స్థానికులు. వారం రోజులుగా మాణిక్ చౌదరి షాప్ తెరవకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది.ఇంట్లో కూడా ఎవరూ లేకపోవడంతో.. బంగారంతో పారిపోయాడని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు బాధితులు. మాణిక్ చౌదరిపై నాలుగు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి ఫిలింనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చీటీలు, అప్పుల పేరుతో పలువురి నుంచి లక్షల రూపాయలు తీసుకున్నాడు మాణిక్ చౌదరి.అలాగే వడ్డీలు ఇస్తానంటూ స్నేహితులు , స్థానికుల వద్ద కోట్లాది రూపాయలను సదరు వ్యాపారి వసూలు చేసినట్లు సమాచారం. మాణిక్ చౌదరి రూ.10 కోట్లకు పైగా మోసం చేసినట్లు ఫిలింనగర్ పోలీసులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టారు. తమకు న్యాయం చేయాలని బాధితులు ఆందోళన చేపట్టారు. మాణిక్ చౌదరి కోసం పోలీసులు వెతుకుతున్నారు. మాణిక్ గురించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే తమకు తెలియజేయాలని ఫిలింనగర్ పోలీసులు సూచించారు.

## కూతురిని చంపి తల్లి ఆత్మహత్య



మహబూబ్‌నగర్,ఆగస్టు 26(టుడే విదుర): ముక్కుపచ్చలారని మూడేళ్ల కూతురిని గొంతు నులిమి చంపేసిన తల్లి.. తర్వాత తానూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగింది. వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన యశోద (36)కు 12 ఏళ్ల క్రితం వివాహమయింది. ఆమెకు ఓ కొడుకు, మూడేళ్ల కూతురు అక్షర ఉన్నారు. తన భర్త నరేశ్ విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ ఏడాది జూలైలో ఇంటి ముందు జీడిపప్పు ఆరబెట్టగా ఓ కుక్క ఎంగిలి చేసింది. కుటుంబ సభ్యులు ఏం కాదులే అనుకుని ఆ జీడిపప్పును వంటకు వాడేశారు. కొద్దిరోజులుగా యశోద ఒంటిపై అలర్జీ ప్రారంభమైంది. తన అలర్జీకి కుక్క ఎంగిలి చేసిన జీడిపప్పే కారణమని రేబిస్ ఇంజక్షన్ కూడా తీసుకున్నది. అయినా అలర్జీ తగ్గకపోవడం, తన మానసిక పరిస్థితి కూడా సరిగా లేకపోవడంతో సోమవారం భర్త బయటకు వెళ్లిన తరువాత కూతురు అక్షరను గొంతు నులిమి చంపేసింది. తరువాత తానూ ఆత్మహత్య చేసుకుంది. చనిపోయే ముందు ఇంట్లో ఉన్న బ్లాక్ బోర్డు, డోర్‌లపై తన భర్త, కొడుకు బాగుండాలని, వాళ్ళు మంచిగా వైద్యం చేయించుకోవాలని రాసింది.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



జడ్చర్ల, నసురుల్లాబాద్,ఆగస్టు 26(టుడే విదుర): అప్పులు తెచ్చి సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బతినడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఈర్లపల్లి తండాకు చెందిన ఇస్లావత్ రవి(40) తన ఎకరన్నర భూమిలో గతేడాది పత్తి పంటను సాగుచేయడానికి, ఇంటి అవసరాల కోసం అప్పులు చేశాడు. వేసిన పత్తి పంట పూర్తిగా దెబ్బతినడంతో చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా నస్రులాబాద్ మండలంలోని నెమలి గ్రామానికి చెందిన రైతు బొబ్బిలి శ్రీనివాస్ (37) తన పొలంలో విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు. పొలానికి నీరు పెట్టేందుకు గాను విద్యుత్ బోర్ వద్ద స్విచ్ ఆన్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## రీ మోడలింగ్ కార్ల మ్యాట్, సీట్ల కింద 122.85 కిలోల ఎండు గంజాయి స్మగ్లింగ్

సంగారెడ్డి అర్బన్,ఆగస్టు 26(టుడే విదుర): రీ మోడలింగ్ చేసిన కారు ఫ్లోరింగ్ మ్యాట్, సీట్ల కింద 122.85 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మెదక్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ మీడియాకు తెలిపారు. జిల్లాలోని కంది మండలం చేర్యాల గేటు వద్ద 3 రోజుల క్రితం 65వ నంబర్ జాతీయ రహదారిపై చేపట్టిన తనిఖీలో టాటా విస్టా కారులో ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ వ్యక్తి ఇచ్చిన క్లూ



ఆధారంగా 3 రోజులుగా ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. చేర్యాల గేటు వద్ద అనుమానాస్పదంగా వస్తున్న టాటా ఇండికా విస్టా డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని కారు తనిఖీ చేయడంతో డిక్కీలో 69.5 కిలోల గంజాయి, కాసేపటికి వచ్చిన మరో టాటా ఇండికా విస్టా కారు నుంచి 53.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని హరికిషన్ తెలిపారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దు నుంచి మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలోని చాచా మహ్మద్ అనే వ్యక్తి కోసం తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించినట్టు చెప్పారు. నిందితులు మహారాష్ట్రలోని బీడ్ జిల్లా అత్తర్ నగర్ వాసి అబ్దుల్ వహాబ్, ఒడిశాలోని గజపతి జిల్లా రాయగడలోని నంకురదా వాసి ఉమాకాంత్‌తోపాటు 2 కార్లు, 2 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చాచా మహ్మద్‌ను నిందితుడిగా పేర్కొన్నట్లు తెలిపారు. ఈ గంజాయి విలువ సుమారు రూ.40 లక్షలుంటుందని హరికిషన్ వెల్లడించారు.

## చీటింగ్ కేసులో నౌహీరా షేక్ మరోసారి అరెస్ట్



ఆగస్టు 26(టుడే విదుర):హీరా గ్రూప్ సంస్థల అధినేత్రి నౌహీరా షేక్ మరోసారి అరెస్ట్ అయ్యారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఇంతెజార్‌గంజ్ పోలీసులు నౌహీరా షేక్‌ను అరెస్ట్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేసేందుకు వెళ్లిన సమయంలో ఇంతెజార్‌గంజ్ పోలీసులు ఆమెను ఆదివారం అరెస్ట్ చేశారు. బంగారంలో పెట్టుబడుల పేరుతో వరంగల్‌కు చెందిన ఫర్వేజ్, ఎజాజ్, ఎజాజ్ భార్య నుంచి రూ. 33 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2021లో ఇంతెజార్‌గంజ్ పోలీసులు నౌహీరాపై కేసు నమోదు చేశారు. వరంగల్ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ)పై ఇంతెజార్‌గంజ్ పోలీసులు నౌహీరాను అరెస్ట్ చేసి నర్సంపేట సబ్‌జైలుకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

## ఉత్సవాలు ప్రారంభం కాకముందే.. తొలి విగ్రహం నిమజ్జనం



హైదరాబాద్‌ఆగస్టు 26(టుడే విదుర): వినాయక ఉత్సవాలు ప్రారంభం కాకముందే హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం జరిగింది. దోమల్‌గుడకు చెందిన మండప నిర్వాహకులు వినాయ కుడి విగ్రహాన్ని కొనుగోలు చేసి మండపానికి తరలిస్తుండగా హిమాయత్ నగర్‌లో కేబుల్ వైరుకు తగిలి కింద పడిపోయింది. ఈ ఘటనలో విగ్రహం కొంత ధ్వంసం అయింది. దీంతో నిర్వాహకులు ధ్వంసం అయిన వినాయకుడి విగ్రహాన్ని పీపుల్స్‌ప్లాజా వద్ద క్రేన్ సహాయంతో నిమజ్జనం చేశారు.

## ఐదుగురు మెడికోలపై 6 నెలల సస్పెన్షన్



నిజామాబాద్,ఆగస్టు 26(టుడే విదుర): నిజామాబాద్ మెడికల్ కళాశాలలో జూనియర్ విద్యార్థి రాహుల్‌రెడ్డిని ర్యాగింగ్ చేసిన ఐదుగురు సీనియర్ విద్యార్థులను కళాశాల నుంచి 6 నెలలు సస్పెండ్ చేశారు. జరిగిన యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ తెలిపారు. ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం విద్యార్థి రాహుల్ రెడ్డిని శనివారం సీనియర్లు ర్యాగింగ్ చేసిన ఘటన వెలుగు చూసింది. ఈ ఘటనను విద్యార్థి, ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని యాంటీ ర్యాగింగ్ కమిటీ సమీక్షించింది. ఈ కమిటీ ముందు విద్యార్థి రాహుల్ రెడ్డి తల్లిదండ్రులు హాజరై వాదనలు వినిపించారు.

## జూబ్లీహిల్స్‌లో 100 కోట్ల విలువైన స్థలం స్వాధీనం



హైదరాబాద్ సిటీ,ఆగస్టు 26(టుడే విదుర): మహానగరంలోని మరో విలువైన స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి హైడ్రా కాపాడింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు సమీపంలో.. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న 2వేల చదరపు గజాల స్థలంలో ఆక్రమణలను తొలగించింది. ఈ స్థలం విలువ దాదాపు రూ.100 కోట్ల వరకు ఉంటుందని సంస్థ చెబుతోంది. జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన 2000 చదరపు గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించారు. పిల్లా సత్యనారాయణ అనే వ్యక్తి ఈ స్థలానికి నకిలీ ఇంటి నంబరుతో నర్సరీ నిర్వహిస్తున్నాడు. ఆయనపై గతంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. స్థలాన్ని పలుమార్లు జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా.. సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించాడు. న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించి స్టేటస్ కో తెచ్చుకున్నాడు. కోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తూ అక్కడ నర్సరీ నిర్వర్తిస్తున్నాడు. అనుమతి లేకుండా షెడ్లు నిర్మించాడు. దీనిపై ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదులందాయి. దీంతో రంగంలోకి దిగిన అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ప్రజావసరాలకు కేటాయించిన స్థలంలో నర్సరీ నడుపుతున్న సత్యనారాయణకు హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో మరోసారి సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించగా అక్కడ ఆయనకు చుక్కెదురైంది. గతంలో ఉన్న స్టేటస్‌కోను కొట్టేసిన న్యాయస్థానం.. చర్యలు తీసుకునేందుకు హైడ్రాకు అనుమతినిచ్చింది. దీంతో రెండు దశాబ్దాలుగా అక్రమార్కుల చేతిలో చిక్కిన స్థలాన్ని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాత్కాలిక నిర్మాణాలు, నర్సరీని తొలగించారు. హైడ్రా కాపాడిన స్థలమంటూ బోర్డులూ ఏర్పాటు చేశారు. హైడ్రా చర్యలపై జూబ్లీహిల్స్ కో ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కిన ఏడీఏ

చుంచుపల్లి,ఆగస్టు 26(టుడే విదుర): ఫర్టిలైజర్ షాపుకు జారీ చేసిన షోకాజు నోటీసు రద్దు చేయడానికి దాని యజమాని నుంచి రూ.25 వేల లంచం తీసుకుంటూ భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా వ్యవసాయశాఖ సహాయ డైరెక్టర్ (ఏడీఏ) నర్సింహారావు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. యూరియా అమ్మకాలకు అనుమతులేవని జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఒక ఫెర్టిలైజర్ షాప్ యజమానికి ఆయన ఈ నెల 23న



షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు రద్దు చేయడానికి రూ.50 వేలు లంచమడిగిన ఏడీఏకు రూ.25 వేలు ఇవ్వడానికి షాప్ యజమాని ఒప్పందం కుదుర్చుకున్నాడు. తర్వాత ఈ విషయమై ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వారి సూచన మేరకు ఏడీఏ కార్యాలయంలోనే నర్సింహారావుకు రూ.25 వేలు ఇస్తుండగా అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు.. ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా

# టుడే వినోదం

# ఎందుకు అంత ఆలస్యం



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఎక్కడ కనిపించినా అభిమానుల నుంచి వచ్చే ఒకే ఒక్క మాట ఓజీ కుర్ర డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. పవన్ ఏ ఈవెంట్ కు వెళ్ళినా ఓజీ నామస్మరణమే. ఇక ఎట్టకేలకు సెప్టెంబర్ 25 న ఓజీ ప్రేక్షకుల ముందకు రానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రిలీజ్ డేట్ కు ఇంకా పట్టుమని నెలరోజులు కూడా సమయం లేదు. కానీ, మేకర్స్ మాత్రం ప్రమోషన్స్ మొదలుపెట్టలేదు. దీంతో ఫ్యాన్స్ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.మళ్లీ ఏదైనా జరిగి ఎక్కడ ఈసారి కూడా ఓజీ వాయిదా పడుతుందేమో అని భయపడుతున్నారు. అలా జరగడానికి అస్సలు అవకాశం లేదని ఇండస్ట్రీ వర్గాల మాట. మరి ఎందుకింత ఆలస్యం అంటే.. అందుతున్న సమాచారం ప్రకారం ఓజీ షూట్ ఇంకా బాలెన్స్ ఉందని అంటున్నారు. అదేంటీ ఎప్పుడో ఈ సినిమా షూటింగ్ ఫినిష్ అయ్యిందని చెప్పారు కదా.. మళ్లీ షూట్ ఏంటి అంటే.. పవన్ కళ్యాణ్ కి సంబంధించి ఇంకో 6 రోజులు షూట్ ఉందని,ఈ మధ్యనే పవన్ ఆ షూట్ ను ఫినిష్ చేసే పనిలో పడ్డాడని టాక్ నడుస్తోంది. ప్రమోషన్స్ సినిమాకు ఎంత ముఖ్యమో అందరికీ తెల్సిందే.




# ఈ మధ్య చూసిన, నచ్చిన సినిమా ఇదే.. 3 BHKకి సచిన్ ప్రశంసలు




గత నెలలో థియేటర్లలోకి వచ్చి ఫర్వాలేదనిపించుకున్న సినిమా ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ జానర్లో తెరకెక్కిన ఈ చిత్రం అన్ని వర్గాలు, విడుదలైన అన్ని ప్రాంతాల నుంచి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ఆపై ఓటీటీలకి సైతం వచ్చిన ఈ చిత్రం థియేటర్లకు మించి ఆదరణను దక్కించుకుంది. ఇంకా దక్కించుకుంటుంది. చిత్తా వంటి సెన్సిబుల్ థ్రిల్లర్ తర్వాత బొమ్మరిల్లు సిద్ధార్థ్ హీరోగా నటించగా శరత్ కుమార్ చైత్ర జే అచార్, మితా రఘునాథ్, దేవయాని కీలక పాత్రల్లో నటించారు. శ్రీ గణేశ్ దర్శకత్వం వహించాడు.%ఓ మధ్య తరగతి కుటుంబం సొంత ఇంటిని కొనుగోలు చేయడానికి తమ జీవితంలో ఎదుర్కొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కి ప్రతి ఒక్కరిని టచ్ చేసింది. అయితే ఇప్పుడు ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతుండగా విశేష ఆదరణ పొందుతుంది. ఇదిలాఉంటే ఈ చిత్రం ఓటీటీకి వచ్చి దాదాపు నెల గడుస్తుండగా తాజాగా ఇప్పుడు మరోసారి నేషనల్ వైడ్ ట్రెండింగ్‌కు వచ్చేసింది. అందుకు కారణం క్రికెట్ గాడ్ సచిన్ టెండుల్కర్


# బుక్స్ లో లీనమై..





అర్జున్ రెడ్డి భామ హద్దు దాటిందా అంటే నిజమే అన్న మాట వినిపిస్తుంది. షాలిని పాండే. అర్జున్ రెడ్డి సినిమాతో తెలుగునాట అడుగుపెట్టింది. ముద్దుగా.. బొద్దుగా అమ్మడి అందానికి.. ప్రీతీ పాత్రలో ఆమె నటనకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. అర్జున్ రెడ్డి సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయిన షాలినిని చూసి భవిష్యత్ లో స్టార్ హీరోయిన్ అవుతుంది అనుకున్నారు. కానీ, అనుకున్నది ఒక్కటి అయితే.. ఇక్కడ జరిగింది మరొకటి.అర్జున్ రెడ్డి సినిమా తరువాత షాలిని కేవలం కొన్ని సినిమాలకే పరిమితమయ్యింది. అవి కూడా ఆశించినఫలితాన్ని అందుకోలేదు. దీంతో టాలీవుడ్ లో కలిసి రాలేదని బాలీవుడ్ లో పాగా వేయడానికి ప్రయత్నించింది. దానికోసం బొద్దుగా ఉన్న ఈ భామ బక్కచిక్కి జీరో సైజ్ కు చేరుకుంది. అసలు ఒకానొక సమయంలో షాలినిని తెలుగు ప్రేక్షకులు గుర్తుపట్టలేకపోయారు అంటే అతిశయోక్తి కాదు. ఎలాగోలా బాలీవుడ్ లో మహరాజ్, డబ్బా కార్టెల్ లాంటి ప్రాజెక్ట్స్ లో ఛాన్స్ పట్టేసి మంచి విజయాలను అందుకుంది. ప్రస్తుతం అడపాదడపా బాలీవుడ్ సినిమాల్లో నటిస్తూ బిజీగా మారింది.

# మలయాళ ముద్దుగుమ్మలతో మన్మథుడు..



: నిజంగా మన్మథుడు ఎలా ఉంటాడో తెలియదు కానీ, ఉంటే మాత్రం అచ్చం అక్కినేని నాగార్జునలానే ఉంటాడని అభిమానులు చెప్పుకొస్తున్నారు. వయస్సు పెరిగేకొద్దీ ఎవరికైనా అందం తరుగుతుంది. యవ్వనం తగ్గుతుంది. కానీ, నాగ్ విషయంలో ఇదంతా రివర్స్ లో జరుగుతుంది. వయస్సు పెరిగేకొద్దీ నాగ్ మరింత యవ్వనంగా తయారవుతున్నాడు. అసలు నాగ్ ను చూసిన వారెవ్వరైనా ఆయన వయస్సు 66 అంటే నమ్ముతారా.. ? నిజమే ప్రస్తుతం నాగ్ 66 వ పడిలో ఉన్నాడు. అయినా వన్నె తగ్గని అందంతో కుర్ర హీరోలకు పోటీ ఇస్తున్నాడు. తాజాగా అక్కినేని నాగార్జున మలయాళ ముద్దుగుమ్మలతో కలిసి కనిపించాడు. మలయాళ కుర్ర హీరోయిన్స్ అయిన మమితా బైజు, ప్రియా ప్రకాష్ వారియర్, అనస్వర రాజన్, దీప్తి సతీలతో నాగ్ ఫోటోకు ఫోజ్ ఇచ్చాడు. నలుగురు హీరోయిన్స్ మధ్య కింగ్.. ఇంకా నవ మన్మథుడిలానే కనిపిస్తున్నాడు. కింగ్ సినిమాలో నువ్వు రెడీ నేను రెడీ సాంగ్ లో టాలీవుడ్ హీరోయిన్స్ అందరూ వచ్చి కింగ్ తో డ్యాన్స్ వేసి వెళ్లారు. ఇప్పుడు ఆ సాంగ్ ను నాగ్ రీక్రియేట్ చేశాడు. అయితే ఇది ఎక్కడ జరిగింది. ఏ ఈవెంట్ లో వీరు కలిశారు అనే డీటైల్స్ ఇంకా తెలియరాలేదు. ఇక ఈ ఫోటో మాత్రం సోషల్ మీడియాను ఒక ఊపు ఊపేస్తుంది. నాగార్జున ఎక్కడైనా మన్మథుడే అని కొందరు. జెన్ జెడ్ హీరోయిన్స్ తో కింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.ఇక నాగార్జున కెరీర్ గురించి చెప్పాలంటే.. హీరో నుంచి టర్న్ తీసుకున్న కింగ్.. కూలీ సినిమాతో విలన్ గా మెప్పించాడు.

# అల్లు అర్జున్ భార్యనా.. మజాకానా..



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఎంత స్టైలిష్ గా ఉంటాడో అందరికీ తెల్సిందే. మొదట బన్నీకి స్టైలిష్ స్టార్ అనే బిరుదు ఉండేది. ఆ తరువాత అది ఐకాన్ స్టార్ గా మారింది. సినిమాల్లోనే కాకుండా బయట కూడా ఎంతో స్టైలిష్ గా కనిపిస్తూ ఉంటాడు బన్నీ. ఇక ఈ స్టైలిష్ స్టార్ కు తగ్గట్లే ఆయన భార్య కూడా చాలా అందంగా.. స్టైల్ గా కనిపిస్తూ ఉంటుంది. అల్లు అర్జున్ భార్య అల్లు స్నేహ రెడ్డి గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.పెళ్లి తరువాత భర్తలు మారిపోతారు అని అంటారు. అందుకు సెలబ్రిటీలు అతీతమేమి కాదు. బెస్ట్ ఉదాహరణ బన్నీ అనే చెప్పొచ్చు. స్నేహతో పెళ్ళికి ముందు బన్నీ ఈవెంట్స్ లో చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. పెళ్లి తరువాత బన్నీతో చాలా మార్పు వచ్చింది. తన సినిమాల్లో ముద్దు సీన్స్ ను కూడా కట్ చేసేశాడు. ఇదంతా స్నేహ వలనే అని బన్నీ చెప్పుకొచ్చాడు కూడా. ఇక పెళ్లి తరువాత స్నేహ అడపదడపా సోషల్ మీడియాలో కనిపించేది.

# ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు..



'నాకు రొమాంటిక్ కామెడీ, స్పోర్ట్స్ డ్రామాలంటే ఇష్టం. మంచి స్పోర్ట్స్ డ్రామా, ఇన్స్పిరేషనల్ క్యారెక్టర్ వస్తే ఖచ్చితంగా చేస్తాను' అని నారా రోహిత అన్నారు. అయన హీరోగా నటించిన చిత్రం 'సుందరకాండ' వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ (%ఝ్రా%) బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. వృతి వాఘాని, శ్రీ దేవి విజయ్ కుమార్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో నారా రోహిత్ విలేకరులతో మాట్లాడారు. సుందరకాండ నా కం బ్యాక్ సినిమా అనుకోవాలి. 2022 లోనే ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ స్టార్ట్ చేశాము. డైరెక్టర్ వెంకటేష్ ఈ ఐడియా చెప్పినప్పుడు కంగారు పడ్డాను. ఆడియన్స్ ఎలా తీసుకుంటారో అనిపించింది. ఐతే అదే సమయంలో వచ్చిన బ్రో డాడీ సినిమా ఒక విండో ఓపెన్ చేసింది. ఆక్వాడ్ గా ఉండే పాయింట్ అందంగా డీల్ చేసిన సినిమా అది. ఆ స్టైల్ లో చేస్తే వర్క్ అవుతుందనిపించింది. వెంకటేష్ ఒక 30 సీన్స్ రాసుకుని వచ్చాడు. నాకు చాలా నచ్చాయి. అలా ప్రాజెక్ట్ స్టార్ట్ చేశాం. ఈ సినిమా చూస్తున్నంత సేపు ఆడియన్స్ ఫేస్ లో ఒక స్మైల్ ఉంటుంది. లైటర్ వెన్ లో చాలా లైవ్లీగా మంచి ఫన్ తో ఉంటుంది.




# క్రీడావార్తలు




## చాను రికార్డు స్వర్ణం



అహ్మదాబాద్: గాయం నుంచి కోలుకొని ఏడాది తర్వాత రీఎంట్రీ ఇచ్చిన టోక్యో ఒలింపిక్స్ రజత పతక వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను రికార్డు బ్రేకింగ్ ప్రదర్శనతో అదరగొట్టింది. సోమవారం జరిగిన కామన్వెల్త్ చాంపియన్‌షిప మహిళల 48 కిలోల విభాగంలో చాను.. స్నాచ్‌లో 84 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కిలోలతో మొత్తం 193 కిలోల బరువు ఎత్తి స్వర్ణం సొంతం చేసుకొంది. ఎత్తిన చాను కామన్వెల్త్ రికార్డులను బద్దలుకొట్టింది. ఓవరాల్‌గా గతంలో కంటే అధికంగా 14 కిలోల బరువు ఎత్తింది. మలేసియా లిఫ్టర్ ఐరెనీ హెన్రీ 161 (73o88) కిలోలు ఎత్తి రజతం, వేల్స్ లిఫ్టర్ నికోల్ రాబర్ట్స్ 150 (70o80) కిలోలు లిఫ్ట్ చేసి కాంస్యం దక్కించుకొన్నారు. పురుషుల 60 కిలోల కేటగిరీలో జాతీయ క్రీడల చాంపియన్ రిషికాంత్ సింగ్ 271 (120o151) కిలోలు ఎత్తి బంగారు పతకం నెగ్గాడు. గతంలో మీరాబాయి 49 కిలోల కేటగిరీలో పోటీపడేది. అయితే, విశ్వక్రీడల నుంచి ఆ విభాగాన్ని తొలగించడంతో 48 కిలోల విభాగానికి మారింది.%ఇక, ఇదే టోర్నీ సబ్ జూనియర్ విభాగంలో తెలుగమ్మాయి రెడ్డి భవాని పతకంతో సత్తా చాటింది. ఏపీలోని విజయనగరానికి చెందిన భవాని మహిళల 48 కిలోల కేటగిరిలో రజత పతకం గెలుచుకుంది. స్నాచ్‌లో 66 కిలోలు ఎత్తిన భవాని.. క్లీన్ అండ్ జెర్క్‌లో 92 కిలోలు లిఫ్ట్ చేసింది. దీంతో ఓవరాల్‌గా 158 కిలోల బరువుతో భవాని రెండోస్థానంలో నిలిచింది.

## మెద్వెదెవ్ అవుట్



న్యూయార్క్: రష్యా స్టార్ డానిల్ మెద్వెదెవ్‌కు వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్‌లోనూ మొదటి రౌండ్‌లో చుక్కెదురైంది. 2021 యూఎస్ ఓపెన్ చాంపియన్ మెద్వెదెవ్‌కు ఫ్రాన్స్ ఆటగాడు బెంజమిన్ బోన్జీ మళ్లీ షాకిచ్చాడు. ఇక ఏడో సీడ్ నొవాక్ జొకోవిచ్, టాప్ సీడ్ సబలెంక, నాలుగో సీడ్ పెగుల, ఏడో సీడ్ పోలిని, 10వ సీడ్ నవారో శుభారంభం చేశారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో అన్‌సీడెడ్ బోన్జీ 6-3, 7-5, 6-7 (7), 0-6, 6-4తో 13వ సీడ్ మెద్వెదెవ్‌కు ఝలకిచ్చాడు. వింబుల్డన్ మొదటి రౌండ్‌లో కూడా డానిల్‌ను బోన్జీ తిరుగుముఖం పట్టించడం గమనార్హం. ఇక..25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న జొకోవిచ్ 6-1, 7-6 (3), 6-2తో టీన్‌పై గెలుపొంది రెండో రౌండ్‌కు చేరాడు. ఇతర మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-5, 6-2, 6-4తో ఎమీలో నవాపై, 21వ సీడ్ మక్‌హాక్ 6-3, 6-1, 6-1తో నార్డీపై, నకాషిమా 6-2, 6-7 (7), 2-6, 6-2, 7-6 (10)తో జోంగ్‌పై నెగ్గి రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు. డిఫెండింగ్ చాంపియన్ సబలెంక 7-5, 6-1తో రెబెకా మసరోవాని, పెగుల 6-0, 6-4తో మయార్ షరీఫను, పోలిని 6-2, 7-6 (4)తో ఐవాని, 10వ సీడ్ నవారో 7-6 (9), 6-3తో వాంగ్‌ని, 16వ సీడ్ బెన్సిక్ 6-3, 6-3తో జాంగ్‌ని, అజరెంకా 7-6 (0), 6-4తో ఇనోనీ,ఫిలిప్పీన్స్‌కు చెందిన 20 ఏళ్ల అలెగ్జాండ్రా యాలా సంచలనం సృష్టించింది. తొలి రౌండ్‌లో 6-3, 2-6, 7-6 (13o11)తో 14వ సీడ్ క్లారా టౌసన్‌ను చిత్తు చేసింది. తద్వారా ఓపెన్ ఎరాలో గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రా మ్యాచ్ గెలిచిన తొలి ఫిలిప్పీన్స్ ప్లేయర్‌గా అలెగ్జాండ్రా రికార్డుకెక్కింది. భారీ సంఖ్యలో విచ్చేసిన ఫిలిప్పీన్స్ దేశస్తులు ప్రోత్సహిస్తుండగా ఐదడుగుల తొమ్మిది అంగుళాల పొడగరి అయిన యాలా విజృంభించి ఆడింది. మూడో సెట్‌లో 1-5 వెనుకంజలో నిలిచినా అద్భుతంగా పోరాడి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

## స్పాన్సర్‌షిప్ నుంచి డ్రీమ్ 11 అవుట్

### రూ.358 కోట్ల ఒప్పందం రద్దు

### మరో కంపెనీ వేటలో బీసీసీ




న్యూఢిల్లీ: భారత క్రికెటర్ల జెర్సీలపై ఇక నుంచి డ్రీమ్-11 లోగో కనిపించదు. టీమిండియా ప్రధాన స్పాన్సరర్‌గా కొనసాగుతున్న ఈ ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీ తమ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్-నియంత్రణ బిల్లు రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారింది. దీంతో డ్రీమ్ స్పోర్ట్స్ కంపెనీ తమ ఒప్పందం నుంచి వైదొలిగింది. ఈ విషయాన్ని అటు బీసీసీఐ కూడా ధృవీకరించింది. 2023లో మూడేళ్ల కాలానికి డ్రీమ్-11తో బోర్డు రూ.358 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే డ్రీమ్-11 ఇలా మధ్యలోనే తమ స్పాన్సర్‌షిపను రద్దు చేసుకున్నా బీసీసీఐ జరిమానా విధించే అవకాశం లేదు. ఎందుకంటే నిబంధన ప్రకారం.. కంపెనీ ప్రధాన వ్యాపారాన్ని ఏదైనా ప్రభుత్వ చట్టం ప్రభావితం చేస్తే స్పాన్సర్‌షిప్ నుంచి వైదొలిగినా నష్టపరిహారం ఇవ్వాల్సిన అవసరం ఉండదు. మరోవైపు వచ్చేనెల 9 నుంచి ఆసియాకప్ జరగనున్న తరుణంలో ఈ పరిణామం బీసీసీఐని ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే డ్రీమ్ 11 లోగోలతో కూడిన ఆటగాళ్ల జెర్సీలు కూడా సిద్ధమయ్యాయి. కానీ వాటిని ఉపయోగించడానికి లేదు. ఈ టోర్నీకి స్పాన్సర్‌లు లేకుండానే జట్టు వెళ్తుందా? లేక మరో 15 రోజుల్లోనే బోర్డు కొత్త స్పాన్సర్‌తో ఒప్పందం కుదుర్చుకుంటుందా? అనేది తేలాలి. మరోవైపు టొయోటా కంపెనీ స్పాన్సర్‌షిపపై ఆసక్తిగా ఉన్నట్టు సమాచారం.

## ఇషా బృందానికి కాంస్యం

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ ఇషాసింగ్ పతకం సాధించింది. సోమవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో ఇషా సింగ్, మనూ భాకర్, సిమ్రన్‌ప్రీత్ కౌర్ త్రయం మూడోస్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. చైనా స్వర్ణం, కొరియా రజత పతకం అందుకున్నాయి.నీరూకు రెండు స్వర్ణాలు: జాతీయ క్రీడల చాంపియన్ నీరూ ధండ రెండు స్వర్ణాలతో దుమ్మురేపింది. తొలుత మహిళల ట్రాప్‌లో నీరూ పసిడి పతకం కొల్లగొట్టింది. భారత్‌కే చెందిన ఆషిమా అహ్లావత్ కాంస్య పతకం నెగ్గింది. అనంతరం నీరూ, ఆషిమా, ప్రీతీ రజాక్ బృందం మహిళల ట్రాప్ టీమ్ పసిడి పతకం సొంతం చేసుకుంది. పురుషుల ట్రాప్ విభాగంలో భౌనీష్ రజతం నెగ్గాడు. జూనియర్ మహిళల 25 మీ. పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్లు పాయల్ ఖత్రి, నామ్యా కపూర్, తేజస్విని వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గి క్లీన్‌స్వీప్ చేశారు. అలాగే టీమ్ విభాగంలో పాయల్, కపూర్, తేజస్విని త్రయం రజత పతకం కూడా అందుకోవడం విశేషం.



## క్విటోవా బై బై



వరల్డ్ మాజీ నెం.1, 2011, 2014 వింబుల్డన్ విజేత పెట్రా క్విటోవా టెన్నిస్‌కు వీడ్కోలు పలికింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 35 ఏళ్ల క్విటోవా యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో 1-6, 0-6తో డ్యానీ ప్యారీ చేతిలో ఓటమిపాలైంది. కాగా, యూఎస్ ఓపెన్ తనకు కెరీర్‌లో చివరిదని క్విటోవా ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. బిడ్డకు జన్మనివ్వడంతో 2024 సీజన్ మొత్తం ఆటకు దూరంగా ఉన్న క్విటోవా..గత ఫిబ్రవరిలో పునరాగమనం చేసినా ఆశించిన మేర రాణించలేకపోయింది.

## రోహిత్‌ను సాగనంపేందుకే



న్యూఢిల్లీ: భారత క్రికెటర్లను మరింత ఫిట్‌గా ఉంచే ప్రక్రియలో బీసీసీఐ ఇటీవల కొత్తగా బ్రాంకో టెస్టును ప్రవేశపెట్టింది. అయితే వెటరన్ స్టార్ రోహిత్ శర్మను జట్టులోంచి తప్పించేందుకు ఈ టెస్టును తీసుకువచ్చారని మాజీ ఆటగాడు మనోజ్ తివారీ సంచలన ఆరోపణ చేశాడు. '2027 వన్డే వరల్డ్‌కప్ జట్టులో విరాట్‌ను తీసుకోకుండా ఉండలేరు. అతడి ఫిట్‌నెస్ స్థాయి అలాంటిది. కానీ రోహిత్‌ను పక్కనబెట్టాలని బోర్డు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. అందుకే కొన్ని రోజుల క్రితం కఠినమైన బ్రాంకో టెస్టును ప్రవేశపెట్టారు. రోహిత్ శరీరతత్వం ఎలా ఉంటుందో అందరికీ తెలుసు. కచ్చితంగా తను ఈ టెస్టులో పాస్ అవలేడు. కోచ్ గంభీర్ ఇప్పుడే దీన్ని ఎందుకు అమలు చేయాలనుకుంటున్నాడో అర్థమవుతుంది' అని తివారీ వివరించాడు. అలాగే తాను శ్రీలంక పర్యటనలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించినా జట్టులో చోటు దక్కలేదని, బహుశా అప్పటి కెప్టెన్ ధోనీకి నచ్చలేదేమోనని తెలిపాడు.

## గంభీర్ స్థానంలో గంగూలీ



న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్లకు డైరెక్టర్, మెంటార్‌గా వ్యవహరించిన మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. తాజాగా సౌతాఫ్రికాకు చెందిన ఎస్ఏ20 లీగ్ జట్టు ప్రిటోరియా క్యాపిటల్స్‌కు కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ వార్త సోషల్ మీడియాలో ఊహాగానాలకు తెరలేపింది. ఫ్రాంచైజీ కోచ్‌గా బాధ్యతలు తీసుకొన్నాడంటే.. అతడు త్వరలో భారత కోచ్‌గా వస్తాడంటూ చర్చ మొదలైంది. ఇవన్నీ ఊహాగానాలుగా భావిస్తున్నా.. వాటిల్లో నిజం లేకపోలేదంటున్నారు విశ్లేషకులు. ప్రస్తుత కోచ్ గంభీర్ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో సత్తాచాటినా టెస్టులకు వచ్చేసరికి కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి. రోహిత్, కోహ్లీ, అశ్విన్‌లాంటి ప్లేయర్ల రిటైర్మెంట్‌తో ఆయా స్థానాలు భర్తీచేసే వారి కోసం వెతకాల్సి ఉంది. ఈ క్రమంలో గంగూలీ అయితే జట్టును మెరుగ్గా తీర్చుదిద్దుతాడని ఫ్యాన్స్ భావిస్తున్నారు. కానీ, సీజన్ మధ్యలో కోచ్‌లను తప్పించే సంప్రదాయం బీసీసీఐకు లేదు. అన్నింటికంటే ముందు కోచ్‌గా దాదా తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరం కూడా ఉంది.

## ప్రజ్ఞానందకు వరుసగా ఐదో డ్రా



సెయింట్ లూయిస్ (యూఎస్): సింక్యూఫీల్డ్ కప్‌లో భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద వరుసగా ఐదో గేమ్‌ను డ్రా చేసుకొన్నాడు. ఆరో రౌండ్‌లో పోలెండ్ జీఎం జాన్ క్రిజెస్ టోఫ్‌తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 32 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించాడు. అలీరెజా ఫిరోజా (ఫ్రాన్స్)తో గేమ్‌ను వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు డ్రాగా ముగించాడు. మొత్తం ఆరు రౌండ్ల నుంచి ప్రజ్ఞానంద 3.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో, గుకేష్ 3 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉన్నారు.

# టుడే బిజినెస్

## పసిడి ధరల్లో తగ్గుదల.. నేటి రేట్స్ ఎలా ఉన్నాయంటే..




ఇంటర్నెట్ డెస్క్: దేశంలో బంగారం ధరలు మరోసారి స్వల్పంగా తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,500గా ఉంది. 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం రేటు రూ.93040గా ఉంది . ఇక 18 క్యారెట్‌ల పసిడి రేటు రూ.76130గా ఉంది. వెండి ధరల్లో మాత్రం కాస్త పెరుగుదల కనిపించింది. కిలో వెండి ధర ప్రస్తుతం రూ.1,21,000లకు చేరుకుంది. మరోవైపు, 10 గ్రాముల ప్లాటినం ధర స్వల్పంగా తగ్గి రూ.38,110కు చేరుకుంది

## ఫ్లిప్‌కార్ట్‌లో 2.2 లక్షల సీజనల్ ఉద్యోగాలు



న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ రాబోయే పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సరఫరా, లాజిస్టిక్స్, డెలివరీ విభాగాల్లో 2.2 లక్షల సీజనల్ ఉద్యోగాలను సృష్టించింది. ఇది కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కేవలం పండగల కోసం ఏర్పాటు చేసిన డెలివరీ కేంద్రాల్లో మరో 650 ఉద్యోగాశాలు అందుబాటులోకి రానున్నట్టు కంపెనీ తెలిపింది. కంపెనీలో మహిళా నియామకాలు 10 శాతం పెరగనున్నట్టు వెల్లడించింది. అలాగే దివ్యాంగులకు కూడా ఈ పండగ సీజన్‌లో మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు ఫ్లిప్‌కార్ట్ తెలిపింది.

## భారత్ రేటింగ్ యథాతథం




న్యూఢిల్లీ: భారత సార్వభౌమ పరపతి రేటింగ్‌ను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ఫిచ్ రేటింగ్ సోమవారం ప్రకటించింది. బలమైన వృద్ధితో పాటు విదేశీ నిధులు భారీగా తరలి వస్తుండటం రేటింగ్‌ను యథాతథంగా కొనసాగించేందుకు దోహదపడ్డాయని తెలిపింది. ఈ అంతర్జాతీయ రేటింగ్ సంస్థ ఇండియాకు గతంలో స్థిరమైన వైఖరితో కూడిన 'బీబీబీ మైనస్' రేటింగ్‌ను కేటాయించింది. పెట్టుబడులకు అనుకూలమైన కనిష్ఠ రేటింగ్ ఇది. కాగా, మరో అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీ ఈ మధ్యనే భారత పరపతి రేటింగ్‌ను బీబీబీ స్థాయికి పెంచింది. కాగా దేశ ఆర్థిక వృద్ధిపై ట్రంప్ ప్రతిపాదిత 50 శాతం సుంకాల ప్రభావం అంతంత మాత్రమేనని ఫిచ్ అభిప్రాయపడింది.

## ఫర్నీచర్‌పైనా ట్రంప్ సుంకాలు

న్యూఢిల్లీ: అమెరికాలోకి దిగుమతయ్యే ఫర్నీచర్‌పైనా సుంకాలు విధిస్తానని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత వారాంతంలో సంకేతాలిచ్చారు. ప్రస్తుతం తమ దేశంలోకి ఫర్నీచర్ దిగుమతులపై దర్యాప్తును ప్రారంభించడం జరిగిందని, 50 రోజుల్లో పూర్తవనున్న దర్యాప్తు అనంతరం ఎంత మేర సుంకాలు విధించాలనేది నిర్ణయిస్తామన్నారు. ఇది భారత ఫర్నీచర్ ఎగుమతులపైనా గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎందుకంటే, ప్రపంచంలో అమెరికానే అతిపెద్ద ఫర్నీచర్ దిగుమతిదారు. ప్రపంచ దిగుమతుల్లో 30 శాతం వాటా అమెరికాదే. గత ఏడాది యూఎస్ 2,896 కోట్ల డాలర్ల విలువైన ఫర్నీచర్‌ను దిగుమతి చేసుకుంది. అందులో 60 శాతం చైనా, వియత్నాం నుంచే తరలిపోయింది. కాగా, అమెరికాకు భారత్ ఎనిమిదో అతిపెద్ద ఫర్నీచర్ ఎగుమతిదారు. జీటీఆర్ఐ డేటా ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో మన దేశం నుంచి 110 కోట్ల డాలర్ల విలువైన ఫర్నీచర్, బెడ్లు, పరుపులు అమెరికాకు ఎగుమతయ్యాయి.

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ మెగా డీల్




హైదరాబాద్: అమెరికా టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. హైదరాబాద్‌లో వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫీనిక్స్ సెంటారస్ బిల్డింగ్‌లో 2.65 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని (ఆఫీస్ స్పేస్) లీజుకు తీసుకుంది. హైదరాబాద్‌లోని ఆఫీస్ స్పేస్ మార్కెట్లో ఇప్పటివరకు కుదిరిన అతిపెద్ద లీజు ఒప్పందాల్లో ఇదొకటి. రియల్ ఎస్టేట్ డేటా ప్లాట్‌ఫామ్ ప్రాప్‌స్టాక్ ప్రకారం.. వర్క్‌స్పేస్ నిర్వహణదారు టేబుల్ స్పేస్ టెక్నాలజీస్ నుంచి ఫీనిక్స్ సెంటార్‌సలోని 3,4 అంతస్థులను మైక్రోసాఫ్ట్ ఇండియా ఐదేళ్ల కాలానికి లీజుకు తీసుకుంది. ఈ జూలై 1 నుంచి ఒప్పందం అమలులోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.67 చొప్పున మొత్తం స్థలానికి మైక్రోసాఫ్ట్ నెలకు రూ.1.77 కోట్ల కనీస అద్దె, నిర్వహణ వ్యయాలు, ఇతర చార్జీలు కలిపి మొత్తం రూ.5.4 కోట్లు చెల్లించనుంది. ఏటా అద్దె 4.8 శాతం పెరగనుంది. అంతేకాదు, సెక్యూరిటీ డిపాజిట్ కింద మైక్రోసాఫ్ట్ రూ.42.15 కోట్లు జమ చేసినట్లు ప్రాప్‌స్టాక్ తెలిపింది. వాస్తవానికి టేబుల్ స్పేస్ టెక్నాలజీస్ ఈ స్థలాన్ని బిల్డింగ్ యజమాన్య సంస్థ ఫీనిక్స్ టెక్ జోన్ నుంచి లీజుకు తీసుకుంది. 1998 నుంచి నగరంలో సంస్థ కార్యకలాపాలు: మైక్రోసాఫ్ట్ ఇండియాలో తన తొలి ఆర్ అండ్ డీ సెంటర్‌ను హైదరాబాద్‌లో 1998లో ఏర్పాటు చేసింది. అమెరికా వెలుపల కంపెనీ నిర్వహిస్తోన్న అతిపెద్ద ఆర్ అండ్ డీ సెంటర్ ఇదే. గచ్చిబౌలిలోని కంపెనీ క్యాంపస్ ప్రస్తుతం ఇంజనీరింగ్, కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ సేవలపై దృష్టి సారిస్తోంది. ఫీనిక్స్ సెంటార్‌సలోని క్యాంపస్ మరిన్ని ఆర్ అండ్ డీ బృందాలు, టెక్నాలజీ విభాగాలకు నెలవు కానుంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, పుణె, నోయిడాల్లోనూ మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలు సాగిస్తోంది. ఆఫీస్ స్పేస్‌కు హైదరాబాద్ అడ్డా: భారత్‌లో ప్రీమియం, ఏ గ్రేడ్ ఆఫీస్ స్పేస్ అడ్డాల్లో హైదరాబాద్ ఒకటి. పలు అంతర్జాతీయ టెక్నాలజీ, ఆర్థిక సేవల కంపెనీల కార్యాలయాలతో పాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు నెలవుగా మారింది నగరం. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టింగ్ సేవల కంపెనీ నైట్‌ఫ్రాంక్ డేటా ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్‌లో కోటి చదరపు అడుగుల కార్యాలయ స్థలం లీజు ఒప్పందాలు కుదిరాయి. అందులో టెక్నాలజీ దిగ్గజ కంపెనీలదే అధిక వాటా అని నైట్‌ఫ్రాంక్ పేర్కొంది.

## దేశం ముందు కీలక సవాళ్లు



ముంబై: అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ టారిఫల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ కీలక సవాళ్లు ఎదుర్కోనుందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. పెట్టుబడులు పెంచడం ద్వారా వీటిని ఎదుర్కోవచ్చని అన్నారు. ఇందుకోసం బ్యాంకులు, కంపెనీలు చేతులు కలపాలని కోరారు. అమెరికా సుంకాలతో దెబ్బతినే రంగాలను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కూడా ఆయన హామీ ఇచ్చారు. ముంబైలో ఫిక్కీ, ఐబీఏ నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్‌బీఐ ద్రవ్య విధానం ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తూనే వృద్ధికి దోహదం చేసేలా ఉంటుందన్నారు. చర్యలు తీసుకుంటాం: గత ఆర్థిక సంవత్సరం (2024-25) బ్యాంకుల పరపతి వృద్ధి రేటు మూడేళ్ల కనిష్ట స్థాయికి పడిపోవడంపైనా మల్హోత్రా మాట్లాడారు. దీన్ని సరిదిద్దేందుకు ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగా కంపెనీలు తమ నిధుల కోసం ప్రైవేటు రుణాలు, క్యాపిటల్ మార్కెట్లపై మొగ్గు చూపడం ఇందుకు ప్రధాన కారణమని ఇదే సదస్సులో పాల్గొన్న ఎస్‌బీఐ చైర్మన్ సీ శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు కంపెనీల దీర్ఘకాలిక రుణ అవసరాలపై దృష్టి పెట్టడం మంచిదన్నారు. నీరసించిన పరపతి వృద్ధి రేటు పెంచుకునేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా లిస్టెడ్ కంపెనీల కొనుగోళ్లు, విలీనాలకు అవసరమైన నిధులు సమకూర్చేందుకూ ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం ఇలాంటి ఫండింగ్‌పై ఉన్న నిషేధాన్ని తొలగించాలని త్వరలో ఆర్‌బీఐని కోరబోతున్నాయి. ఫిక్కీ, ఐబీఏ నిర్వహించిన సదస్సులో ఎస్‌బీఐ, ఐబీఏ (ఐబీఏ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఈ విషయం వెల్లడించారు. పూర్తి పారదర్శక పద్ధతిలో కొనుగోళ్లు, విలీనాలకు రెగ్యులేటరీ సంస్థలు, వాటాదారులు అనుమతించినప్పుడు, అలాంటి కొనుగోళ్లు, విలీనాలకు నిధులు సమకూర్చడంలో పెద్ద రిస్క్ ఉండదన్నారు. ప్రస్తుతం కంపెనీలు తమ నిధుల అవసరాల్లో ఎక్కువ భాగాన్ని ఈక్విటీ, రుణ పత్రాలు, అంతర్గత వనరుల ద్వారానే సమకూర్చుకుంటున్న విషయాన్ని శెట్టి గుర్తు చేశారు.

## డిసెంబరు కల్లా కొత్త ఐటీ నిబంధనలు




న్యూఢిల్లీ: కొత్త ఆదాయ పన్ను చట్టం (ఐటీ) నిబంధనలను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఈ ఏడాది డిసెంబరు చివరికల్లా నోటిఫై చేయబోతోంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) సభ్యుడు ఆర్ఎన్ పర్బత్ ఈ విషయం వెల్లడించారు. నిబంధనలతో పాటు సరళీకరించిన ఐటీ ఫారాలను కూడా విడుదల చేస్తామన్నారు. పార్లమెంట్ ఆమోదించిన కొత్త ఐటీ చట్టానికి రాష్ట్రపతి ముర్ము ఈ నెల 21న ఆమోద ముద్ర వేశారు. దీంతో వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త ఐటీ చట్టం అమల్లోకి రానుంది.

## అంకాలజీ విభాగంలోకి జీఎస్‌కే




న్యూఢిల్లీ: గైనకాలజీ క్యాన్సర్లకు ప్రెసిషన్ థెరపీ అందుబాటులోకి తేవడం ద్వారా అంకాలజీ విభాగంలోకి ప్రవేశించినట్టు గ్లాక్సో స్మిత్‌క్లైన్ ఫార్మాస్యూటికల్స్ (జీఎస్‌కే) ప్రకటించింది. దేశీయ మార్కెట్లోకి కంపెనీ జెంపెర్లి (దోస్తార్‌లిమాబ్), జెజూలా (నిరాపరిబ్) ఔషధాలను విడుదల చేసింది. ఇవి మహిళల క్యాన్సర్ చికిత్సలో అర్థవంతమైన పురోగతిని తెస్తాయని జీఎసకే ఇండియా ఎండీ భూషణ్ అక్షికర్ అన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006